ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 25.0

వైద్యం చేసేదెలా..?

» పీహెచ్‌సీల్లో రోగ నిర్ధారణ పరీక్షలకు సిబ్బంది కొరత

■ లోపలి పేజీలో..



నైరుతి!

> వర్షాకాలంలో నైరుతి రుతుపవనాలు ఆగమనంతో జిల్లాలో వర్షాలు జోరుగా కురవాల్సి ఉంది. ఈసారి జూన్‌లో నైరుతి రుతుపవనాలు పర్వాలేదనిపించినా జిల్లాలోని నాలుగు మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. జూలైలో పూర్తిగా వర్షాలు మందగించి 24 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. ఇక ఆగస్టులో రాష్ట్రంలో అధిక వర్షపాతాలు నమోదైనా ఏలూరు జిల్లాలో సాధారణం కన్నా ఒక శాతం తక్కువగా వర్షాలు కురవడం గమనార్హం.

» జూన్‌లో నాలుగు మండలాల్లో మైనస్ వర్షపాతం
» జూలైలో 24 మండలాల్లో, ఆగస్టులో 13 మండలాల్లో మందగించిన వర్షాలు
» జిల్లాలో సార్వా సాగు కష్టమేనా..!

ఏలూరుసిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సార్వా సీజన్‌లో నైరుతి రుతుపవనాలు వచ్చిన తర్వాత జిల్లాలో గత మూడు నెలల్లో సరాసరి వర్షపాతాలు పరిశీలిస్తే 14 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. అధిక వర్షపాతాలు నమోదు కావాల్సిన జూలై, ఆగస్టు నెలల సరాసరి పరిశీలిస్తే జిల్లాలో సాధారణం కన్నా 11.7 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెల ప్రారంభమై ఏడు రోజులు కావొస్తున్నా ఇప్పటివరకు వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. ఈ ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం 111.9 మిల్లీమీటర్లు కాగా 182.1 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణం కన్నా 62.8 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. జూన్‌లో జిల్లాలోని 4 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. వేలేరుపాడు మండలంలో మైనస్ 50.4 శాతం, కుక్కునూరు మైనస్ 56.5 శాతం, బుట్టాయిగూడెం మైనస్ 0.1 శాతం, ఆగిరిపల్లి మైనస్ 6.1 శాతం వర్షాలు కురిశాయి. జూన్‌లో మొత్తం మీద సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతాలు జిల్లాలోని 24 మండలాల్లో కురియడంతో వరి సాగు జోరుగా సాగింది.

జూలైలో మైనస్ 22.4 శాతం వర్షపాతం

జూలైలో మొదటి నుంచి వర్షాలు పూర్తిగా మందగించాయి. అందుకే ఈ నెలలో జిల్లాలోని 24 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. జూలైలో సాధారణ వర్షపాతం 242.1 మిల్లీ మీటర్లు కాగా 187.9 మి.మీ మాత్రమే అంటే మైనస్ 22.4 శాతం వర్షపాతం నమోదైంది. వర్షాలు మందగించడంతో సార్వా సాగులో ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాధారణం కన్నా తక్కువగా కురిసిన మండలాలు పరిశీలిస్తే... కుక్కునూరులో మైనస్ 18.5, టి.నరసాపురం మైనస్ 18.3, జీలుగుమిలి మైనస్ 5.4, బుట్టాయిగూడెం మైనస్ 16.6, పోలవరం మైనస్ 30.3, కొయ్యలగూడెం మైనస్ 31.9, జంగారెడ్డి గూడెం మైనస్ 10.4, ద్వారకాతిరుమల మైనస్ 24.2, ఉంగుటూరు మైనస్ 53, భీమడోలు మైనస్ 37.9, పెదపాడు మైనస్ 40.1, ఏలూరు రూరల్ మైనస్ 48.2, దెందులూరు మైనస్ 34.4, నిడమర్రు మైనస్ 60.6, మండవల్లి మైనస్ 26.1, కలిదిండి మైనస్ 1.7, ముదినేపల్లి మైనస్ 23.2, ఏలూరు అర్బన్ మైనస్ 51.6, చింతలపూడి మైనస్ 26.1, లింగపాలెం మైనస్ 41.5, చాట్రాయి మైనస్ 19., ముసునూరు మైనస్ 6.1, నూజివీడులో మైనస్ 46.9, ఆగిరిపల్లిలో మైనస్ 3.7 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఆగస్టులో 13 మండలాల్లో..

ఆగస్టులో సాధారణంగా 239.4 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం కాగా 237 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే ఒక్కశాతం మైనస్ వర్షపాతం సరాసరిగా నమోదైంది. అయితే జిల్లాలోని 13 మండలాల్లో సరాసరి కన్నా చాలా తక్కువగా వర్షపాతాలు నమోదయ్యాయి. జీలుగుమిల్లిలో మైనస్ 12.శాతం, బుట్టాయిగూడెం మైనస్ 51.4, కొయ్యలగూడెం మైనస్ 32.6, జంగారెడ్డిగూడెం మైనస్ 58.4, పెదవేగి మైనస్ 3.8, పెదపాడు మైనస్ 51.3, ఏలూరురూరల్ మైనస్ 41.8, కైకలూరు మైనస్ 16.1, మండవల్లి మైనస్ 32.5, కలిదిండి మైనస్ 25.8, ఏలూరు అర్బన్ మైనస్ 25.3, నూజివీడు మైనస్ 26, ఆగిరిపల్లి మైనస్ 0.8 శాతం వర్షపాతాలు నమోదయ్యాయి. కాగా జూన్, జూలై, ఆగస్టు నెలలు కలిపి మొత్తం వర్షపాతం పరిశీలిస్తే జిల్లాలోని 14 మండలాల్లో సాధారణం కన్నా మించి వర్షపాతాలు నమోదు కాగా 14 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. ఈ మూడు నెలల్లో కలిపి మొత్తం సాధారణ వర్షపాతం 593.4 మి.మీ కాగా 607 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే మూడు నెలలు కలిపితే కేవలం 2.3 శాతం సాధారణం కన్నా ఎక్కువగా వర్షపాతం నమోదైంది. అయితే ఒక్క జూన్‌లోనే సాధారణం కన్నా ఎక్కువగా 62.78 శాతం వర్షపాతం నమోదైంది. జూలై, ఆగస్టు నెలల్లో నైరుతిలో పూర్తిగా వర్షాభావ పరిస్థితులే కనిపించాయి.

సార్వా సాగు కష్టమేనా..

జిల్లాలో అంతంత మాత్రంగా కురుస్తున్న వర్షాల వల్ల సార్వా సాగులో గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. సార్వా సాగు ఈసారి ఎలా ఉంటుందో అన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. జిల్లాలో ఈ ఏడాది 89,983 హెక్టార్లలో సార్వా సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 80.9శాతం అంటే 72,783 హెక్టార్లలో సార్వా వరి నాట్లు వేశారు. మొక్క జొన్న 637 హెక్టార్లకు 125.63 హెక్టార్లలో, పెసలు 72.47 హెక్టార్లలో, మినుములు 1065.59 హెక్టార్లలో, వేరుశనగ 310.91 హెక్టార్లలోను, పత్తి 1717.61 హెక్టార్లలో, చెరకు 127.44 హెక్టార్లలో, పొగాకు 18.74 హెక్టార్లలో సాగు జరుగుతోంది. మిగిలిన పంటలు వేయాల్సి ఉంది. సెప్టెంబరులోనైనా వర్షాలు జోరు కొనసాగిస్తే పంటల సాగు సజావుగా జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

జీవో తెచ్చిన తంటా!



» ప్లాన్‌ల అప్రూవల్‌కు ముందుకు రాని ఎల్‌టీపీలు
» జీవో నెం.20ని సవరించాలంటూ డిమాండ్
» ఎనిమిది నెలలుగా ఒక్క ప్లానూ లేదు
» ఆదాయం కోల్పోతున్న ఏలూరు కార్పొరేషన్

ఏలూరు టూటౌన్, సెప్టెం బరు 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పట్టణ ప్రణాళిక విభాగం ప్రధానాదాయ వనరు. ఈ ఆదాయం నగరాభివృద్ధికి తోడ్పడేది. అలాంటి ప్రణాళిక విభాగం జీవో 20 కారణంగా నిర్వీర్యమైంది. ప్రతీ నెల కనీసం 30- 40 ప్లాన్‌లు అప్రూవల్ అయ్యేవి.గత ఎనిమిది నెలలుగా ఒక్కప్లాన్ కూడా అప్రూవల్‌కు రాక పోవడంతో సిబ్బందికి పనిలేకుండా పోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాల ప్లాన్‌లు అప్రూవల్ సరళతరం చేసే క్రమంలో జీవో నంబర్.20 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు ప్లాన్ అప్రూవల్ చేసే బాధ్య త అప్పగించింది. నూతన భవన నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతల నుంచి ప్రభుత్వం ప్రణాళిక వైదొలిగింది. అధికార మంతా ఎల్‌టీపీలకే అప్పజెప్పింది. ప్లాన్ అప్రూవల్ అయిననాటి నుంచి భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఎల్‌టీపీలనే బాధ్యులుగా చేసింది. దీంతో ఎల్‌టీపీలు ప్లాన్‌లు గీయడానికి, అప్రూవల్ చేయడానికి వెను కంజ వేస్తున్నారు. ఈ కారణంగా నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో గత ఎనిమిది నెలలుగా ఒక్కప్లాన్ అప్రూవల్‌కాలేదు. ప్రతీ నెలా 30 - 40ప్లాన్‌ల వరకు బిల్డింగ్ ప్లాన్‌లు అప్రూవల్ అయ్యేవి. దీంతో నగరపాలక సంస్థకు లక్షలాది రూపా యల ఆదాయం వచ్చేది. సిబ్బందికి కూడా చేతినిండా పని ఉండేది. అయితే జీవో నెం.20తో ప్రణాళిక విభాగం నిర్వీర్యం అయ్యింది. నూతన నిబంధనల ప్రకారం నిర్మాణదారుడు ప్లాన్‌ప్రకారం బిల్డింగ్ నిర్మించకుండా తన ఇష్టానుసారం నిర్మిస్తే దానికి బాధ్యులుగా ఎల్‌టీపీలను చేసింది. నిర్మాణదారుడు తప్పు చేస్తే ప్రభుత్వ అధికారులు పర్యవేక్షించాల్సిందిపోయి ఆ బాధ్యత ఎల్‌టీపీలకు పైకి నెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జీవో నంబర్.20లో అవసరమైతే ఎల్‌టీపీల లైసెన్స్‌రద్దు చేయ డం క్రిమినల్ కేసులు పెట్టడం, ఉన్న అంశాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఎవరైన భవనం నిర్మించుకోవాలంటే ఎల్‌టీపీలు ప్లాన్‌లు వేసి ఆన్‌లైన్‌లో అప్రూవల్ చేసేవారు. ఆ ప్లాన్ ను మున్సిపల్ అధికారులు (మిగతా 8వ పేజీలో)



నాలా పన్ను వసూళ్ల బాధ్యత
స్థానిక సంస్థలదే!

» నాలా చట్టం రద్దుకు ఆర్డినెన్స్ జారీ
» రెవెన్యూ శాఖకు బాధ్యతల నుంచి విముక్తి
» పంచాయతీ, మునిసిపాలిటీ, యూఎల్‌డీలకు ఆదాయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

సుదీర్ఘ కసరత్తుల నేపథ్యంలో నాలా చట్టంను రద్దు చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. దీంతో నాలా పన్ను వసూళ్ల బాధ్యతలను ఇక స్థానిక సంస్థలకు ప్రభుత్వం అప్పగిస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్ కన్వర్షన్ ఫర్ నాన్ అగ్రి కల్చర్ పర్పసెస్- నాలా చట్టం-2006 రద్దుతో ఇక స్థానిక సంస్థలకు డెవలప్‌మెంట్ కింద నాలుగుశాతం వరకు వసూలు చేసే అవకాశం ఇవ్వనున్నారు. దీనికి త్వరలో మార్గదర్శకాలు రానున్నాయి. వాస్తవంగా నాలా చట్టం 2006 జనవరి 1 నుంచి అమల్లోకి రాగా, అప్పట్లో భూమి విలువపై 9 శాతం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కట్టి ఆర్డీవోల ద్వారా భూ యజమానులు ఉత్తర్వులను పొందే వారు. కాలక్రమేణా ఈ పన్ను 9 నుంచి 7, 5లకు తగ్గింది. వైసీపీ ప్రభుత్వంలో 3 శాతానికి తగ్గించగా, కూటమి ప్రభుత్వం ఐదుశాతం చేసింది. తీరా ఆచరణలో ఈ పన్ను వసూళ్ల సక్రమంగా లేక పోవడంతో చట్టం రద్దుకు నిర్ణయించారు. నాలా కింద ఏటా ఏలూరు జిల్లాలో మూడు ఆర్డీవో కార్యాలయాల ద్వారా రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు పన్నుల కింద వసూళ్లను చేయాల్సి ఉంది. ఇది సక్రమంగా సాగడం లేదు. నూతన విధానంలో పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, యూఎల్‌డీలు నాలా వసూళ్లను చేపట్టనున్నాయి. తద్వారా స్థానిక సంస్థలకు ఆర్థికంగా చేయూత ఈ పన్ను ఇవ్వనుంది. తాజాగా రెవెన్యూశాఖ నుంచి తప్పించగా, వీటిని వసూళ్లకు స్థానిక సంస్థలు ఇక ముందుకు సాగనున్నాయి.

బేసిక్‌పై గతంలో ఐదు శాతం పన్ను విధింపు

గ్రామాలు, పట్టణాల్లో వ్యవసాయభూమిని ఇతర వ్యవహారాలకు అనువుగా భూ వినియోగ మార్పిడి చేసుకునే సమయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా భూమి బేసిక్ విలువపై ఒకేసారి ఐదు శాతం భూ యజమానులు నాలా కింద రెవెన్యూశాఖకు చెల్లించేవారు. లే-అవుట్లు, ఇతర ప్లాట్ల విషయంలోనూ ఈ మొత్తాలు రెవెన్యూశాఖ జమకు కావడం లేదు. ఆర్డీవోలు, తహసీల్దార్ల పర్యవేక్షణ లేక నాలా పన్ను వసూళ్ల మందగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకే ఈ బాధ్యత అప్పగిస్తే వారే సకాలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలా వసూళ్లకు శ్రీకారం చుడతా రని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం తీర్మానించింది. దీంతో నాలా స్థానంలో డెవలప్‌మెంట్ ఫీజుతో స్థానిక సంస్థలు మరింత పరిపుష్టి కానున్నాయి.



ముసునూరులో నిర్మాణంలో ఉన్న టాయిలెట్లు

బీసీ హాస్టళ్లలో స్వచ్ఛభారత్ టాయిలెట్లు

» తొలి విడతగా ముసునూరు,కలిదిండిల్లో నిర్మాణం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

బీసీ హాస్టళ్లలో మరిన్ని సౌకర్యాల కల్పనకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం సద్వినియోగం దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా బీసీ హాస్టళ్లలోను స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మాణాలకు రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాలో ముసునూరు బాలుర, కలిదిండి బాలికల ప్రధాన బీసీ హాస్టళ్లలో యూనిట్ వ్యయం రూ.మూడు లక్షల చొప్పున వెచ్చించి నాలుగు సీట్ల కెపాసిటితో వీటి నిర్మాణం చేపట్టారు. ఇక దశలవారీగా జిల్లాలో అవసరమైన చోట్ల కొత్తగా ఈ నిధులతో నిర్మాణం చేపట్టనున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో గతంలో ఆగిపోయిన గోడలు, ప్రహారీలు, మరుగు దొడ్లను వేగవంతంగా జూన్ నాటికి పూర్తి చేయించింది. దీంతో చాలాచోట్ల కొంతలో కొంత మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. ఇంకా మెరుగైన వసతుల దిశగా గ్రామీణ పారిశుధ్యం, నీరు (ఆర్‌డబ్ల్యుఎస్) ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభమయ్యాయి. తాజాగా కైకలూరు మండలం కొల్లేటికోట బాలుర వసతిగృహంలో నిర్మాణానికి ప్రతిపాదించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దశలవారీగా మరుగు దొడ్లను హాస్టళ్లలో నిర్మించనున్నట్టు బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి తెలిపారు.

అంతా ప్రశాంతం



కరకట్ట ప్రాంతంలో పోలీస్ పికెట్

» కైకలూరులో 144 సెక్షన్ అమలు
» పోలీసు పికెట్ల కొనసాగింపు
» అల్లర్లకు పాల్పడిన మరో నిందితుడి అరెస్టు

కైకలూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):వినాయకచవితి ఉత్సవాల్లో చోటు చేసుకున్న అల్లర్ల నుంచి కైకలూరు కోలుకుంది. పట్టణంలో ప్రశాంతమైన వాతావరణానికి వచ్చింది. మంగళవారం ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. పోలీసులు బందోబస్తును నిర్వహించడంతో పాటు 144 సెక్షన్‌ను అమలు చేశారు. పోలీసు పికెట్లను కొనసాగించారు. దానగూడెం, కరకట్ట ప్రాంత నివాసితుల కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్,కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, ఎస్‌ఐలు నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు.

మరో నిందితుడి అరెస్టు

ఈనెల 5వ తేదీన జరిగిన అల్లర్ల కేసులో ఏ-4గా ఉన్న కైకలూరుకు చెందిన జనపాల నాగశివ (మెకానిక్ శివ)ను కైకలూరు-ఏలూరు రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో మంగళవారం మధ్యాహ్నంఅరెస్టు చేసినట్టు డీఎస్పీ శ్రావణకుమార్ కైకలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. శివపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే గొడవలకు కారణమైన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. అల్లర్లలో పాల్పడిన మరికొంతమందిపై దర్యాప్తు చేస్తున్నామని వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కైకలూరులో 144 సెక్షన్ అమలులో ఉన్నందున శాంతిభద్రతల దృష్ట్యా ప్రజలు గుంపులుగుంపులుగా ఉండవద్దని బయట వ్యక్తులు ముందస్తుగా అను మతులు తీసుకుని రావాలన్నారు. కైకలూరుటౌన్ పరిధిలో ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిషేధించబడ్డాయని ఎవరైనా చట్టవ్యతిరేకమైన పనులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అల్లర్లు పునరావృతం కాకుండా చర్యలు : ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరులో ఎలాంటి అల్లర్లు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుని ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు జీవించేలా చూస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. దానగూడెంలో ఇటీవల జరిగిన అల్లర్లలో గాయపడిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఉద్దేశ పూర్వకంగానే కొందరు దాడులకు పాల్పడ్డారని, కైకలూరు పట్టణంలోకి దానగూడెం ప్రజలు వెళ్లాలంటే ఒకటే దారి ఉందని, ప్రస్తుతం అల్లర్ల నేపథ్యంలో భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇకపై ఎలాంటి అల్లర్లు జరగవని తాను పూర్తి స్థాయిలో బాధ్యత వహి స్తానని కొంతమంది రాజ కీయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించేలా చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారన్నారు. ఇరువర్గాల నుంచి రెండు శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు రహదారులు, కమ్యూనిటీ హాలు కావాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడి కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రహదారులకు 'నరేగా నిధులు' మంజూరు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ అడవి కృష్ణ, కైకలూరు సర్పంచ్ కేవీ ఎన్ఎం నాయుడు, సీఐలు పి.కృష్ణ, వి.రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు యువకులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని మంగళవారం ఉదయం పరామ ర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులపై మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.



దానగూడెం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఆరుగురు దివ్యాంగులతో.. డీఎస్సీ నాలుగో విడత జాబితా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ దివ్యాంగుల కోటాలో మిగిలిపోయిన ఆరు పోస్టులకు సెలక్షన్‌జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులతో కూడిన నాల్గవ జాబితాను పాఠశాల విద్యాశాఖ మంగళవారం జిల్లాకు పంపింది. సంబంధిత అభ్యర్థులను పిలిపించి వారి అకడమిక్, ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయాలని ఆదేశించింది. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ మంగళవారం ఎంత ఆలస్యమైనా సర్టిఫికెట్లను వెరిఫై చేసేందుకు ఏర్పాట్లు చేసింది. మలి విడత జాబితాలోని ఆరుగురు అభ్యర్థుల్లో నలుగురు వినికిడి లోపం, ఇద్దరు దృష్టిలోపం గలవారున్నారు. వీరికి బుధ లేదా గురువారాల్లో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెడికల్ బోర్డుఆధ్వర్యంలో వైకల్యశాతం నిర్ధారణ పరీక్షలు నిర్వ హించనున్నారు. డీఎస్సీకి దివ్యాంగుల కోటా సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థుల వైకల్యశాతం నిర్ధారణలో తిరస్కారానికి గురైనవారి స్థానే తదుపరి మెరిట్ అభ్యర్థులను పిలుస్తున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి ఎరువులు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కలిగించాలని కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవసాయాధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీలపై మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎరువులకు ఎటువంటి కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా ఉన్నాయన్నారు. ఎరువుల వినియోగంపై రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కలిగించాలని, ఈ అంశంపై ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా రైతులకు తెలపాలన్నారు. సొసైటీలలో ప్రస్తుతం ఉన్న ఎరువుల నిల్వ లు, రాబోయే వారానికి అవసరమైన ఎరువుల వివరాలపై ఆరా తీశారు. జిల్లాలోని సొసైటీల కార్యదర్శులతో ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ జేడీ షేక్ హబీబ్‌బాషా, జిల్లా సహకార అధికారి అరిమిల్లి శ్రీనివాస్ , మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సీహెచ్ ప్రసాదగుప్తా, మండల వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈజీపీపై సమీక్ష

ఏలూరు,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ)పై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించేలా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పీఎంఈజీపీ పథకం ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలో బ్లాక్‌రైస్, రైడ్‌రైస్ ప్యాకింగ్, వ్యవసాయ, ఉద్యానవన అనుబంధ ఉపాధి యూనిట్లు ఏర్పాటుకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న 861 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సంబంధించి 754 దరఖాస్తులకు సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో రెండు పరిశ్రమలకు సంబంధించి 34.39 లక్షలు పెట్టుబడి రాయితీ కింద అందించేందుకు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, జిల్లా పరిశ్రమలకేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జీ, ఎల్‌డీఎం నీలాద్రి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జిత్రేంద పాల్గొన్నారు.

బీపీఎస్ జీవో ఎప్పుడు..?



» ఏలూరు కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో అక్రమ నిర్మాణదారుల ఎదురుచూపులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)వర్తింపు కోసం మునిసిపాలిటీల్లో భవన యజమానులు ఎదురు చూస్తున్నారు. అక్రమ రీతిలో, కొన్నిచోట్ల ప్లాన్‌లకు విరుద్ధంగా వెలిసిన భవనాలకు ప్రభుత్వం వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు వెసులుబాటు ఇస్తుంది. గతేడాది మార్చితో ఈ గడువు ముగిసింది. అయితే అప్పటి నుంచి వీటి పరిష్కారానికి గడువును ఇవ్వలేదు. ఇటీవల ఎల్ఆర్ఎస్ (లేవుట్ల క్రమబద్ధీకరణ)కు ప్రభుత్వం డిసెంబరు వరకు గడువును పెంచింది. ఈ నేపథ్యంలో బీపీఎస్‌కు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే అధికారంగా జీవో రావాల్సి ఉంది. దీంతో పట్టణ ప్రణాళిక విభాగాలు పాత ఫైళ్లను బూజులు దులిపేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఏలూరు కార్పొరేషన్‌లో 150 వరకు దరఖాస్తులు పరిష్కారానికి యజమానులు ఫీజులు కట్టి ముందుకు రాని వారు ఉంటారని ఒక అంచనా. నూజివీడు, జంగారెడ్డిగూడెంల్లో పదుల సంఖ్యలో వీరి సంఖ్య ఉంటుందని చెబుతున్నారు. అయితే గతంలో ఇచ్చిన కటాఫ్ తేదీ గడువును మరింత ముందుకు జరిపి వర్తింపునకు అవకాశాన్ని ప్రభుత్వం ఇస్తుందని, దీంతో ఎక్కువ మందిని బీపీఎస్ పరిధిలోకి తెచ్చేందుకు చర్యలుంటాయని అధికారులు చెబుతున్నారు. బహుశా ఈ వారంలో బీపీఎస్ జీవో విడుదల చేసే అవకాశం ఉందని టౌన్ ప్లానింగ్‌లోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

రైతుల్లేని వైసీపీ పోరు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత, అధిక ధరలతో రైతన్నలను దగా చేస్తున్నారంటూ 'అన్నదాత పోరు' పేరుతో మంగళవారం వైసీపీ చేపట్టిన నిరసన అభాసుపాలైంది. ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసరకు రైతుల నుంచి ఎలాంటి స్పందనా లభించలేదు. రైతులు ఎవరు కనిపించకపోగా ఆ పార్టీ కార్యకర్తలు, గృహిణులను తీసుకొచ్చి నిరసనను తూతూ మంత్రంగా చేపట్టారు. నిరసన తెలిపారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. పోలీసు ఆంక్షలను ఉల్లంఘించారు. మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల శ్రీనివాస్, కొఠారు అబ్బాయి చౌదరి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాశ్ మాట్లాడారు. రైతులను నడ్డి విరిచే విధంగా కూటమి ప్రభుత్వం తీరు ఉందన్నారు. యూరియా సహ రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయాలనీ, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు.



ఫైర్‌స్టేషన్ సర్కిల్లో వైసీపీ నాయకుల నినాదాలు

కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులపై వైద్యసిబ్బందికి శిక్షణ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులపై జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధి కారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో విడతల వారీ గా ఇస్తున్న ఎన్‌సీడీ 4.0 శిక్షణలో భాగంగా మలి విడత శిక్షణ మంగళవారం జంగారెడ్డి గూడెం, నూజివీడు ఆసుపత్రుల సిబ్బందికి నిర్వహించారు. ఈ నెల 27 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం వివరించారు. ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్లపై శిక్షణనిస్తున్న ట్టు తెలిపారు. ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ హెలీనా, డాక్టర్ అరవింద్ పర్యవేక్షించారు.



మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి తాడేపల్లిగూడెం మార్కెట్‌కు పంపిన ఉల్లి, కర్నూలు ఉల్లిని పరిశీలిస్తున్న ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో

ఉల్లి.. లొల్లి..

- రూ.12 ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు
- మార్కెట్‌లో రూ.3 నుంచి 4 మధ్య విక్రయాలు
- కొనుగోలుకు ముందుకురాని వైనం
- మార్కెట్‌లో కుళ్లిపోతున్న నిల్వలు
- కర్నూలు రైతులు కూడా తరలించిన ఉల్లి లోడు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఉల్లి ధర దారుణంగా ఉంది. వీటిని కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం కర్నూలు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో మార్కెఫెడ్ ద్వారా క్వింటా రూ.1200 ధరకు కొనుగోలు చేస్తుంది. వీటిని ఇతర మార్కెట్లకు తరలిస్తుంది. దీనిలో భాగంగా 4 లారీల్లో తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు మార్కెఫెడ్ పంపిన ఉల్లి లోడు వచ్చింది. ఇక్కడ విక్రయించేందుకు అధికారులు ఒక ప్రైవేట్ గోదాము వద్ద ఉంచారు. వీటిలో ఒకటిన్నర లారీలు మాత్రమే విక్రయాలు జరిగాయి. మిగిలిన ఉల్లి లారీల నుంచి దింపలేదు. అసలే దెబ్బతిన్న ఉల్లి అధిక లోడుతో ఇక్కడికి రావడంతో లారీల నుంచి ఉల్లిరసం బయటకు వస్తోంది. దించిన ఉల్లి కూడా కంపుకొడుతోంది. నాలుగు లారీల్లో 36 టన్నులు, 30 టన్నులు, 27 టన్నులు, 25 టన్నుల వంతున వేసి తీసుకొచ్చారు. ఒక లారీలో ఉన్న సరుకును పూర్తిగా అమ్మగా మరో లారీలో సగం మాత్రమే అమ్మారు. ఒకటిన్నర లారీల ఉల్లి మాత్రం ఒక మోస్తరుగా ఉండడంతో కిలో రూ.3 నుంచి 4 మధ్య విక్రయించారు. మిగిలిన ఉల్లిని కిందికి దించేందుకు కూడా సాహసం చేయడం లేదు. దీంతో మూడు లారీల్లోను ఉల్లి ఉండిపోయింది. దించుకుంటే వెళ్లిపోతామని కర్నూలు నుంచి వచ్చిన డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. తమకు కిరాయి ఇవ్వకపోయినా పర్వాలేదు. కనీసం దిగుమతి చేయాలని వేడుకుంటున్నారు.

కర్నూలు ఉల్లిని పరిశీలించిన ఆర్డీవో

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చిన నాలుగు లారీల ఉల్లిని తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌భానో మంగళవారం పరిశీలించారు. కొనుగోలు చేయడానికి వచ్చిన వారు, వ్యాపారులతో సమీక్షించారు. కర్నూలు నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ఇక్కడకు పంపిన ఉల్లి పూర్తిగా పాడైందని, దీన్ని కొనుగోలు చేయడానికి చిరు వ్యాపారులు ముందుకు రావడం లేదని వ్యాపారులు ఆర్డీవోకు వివరించారు. నాణ్యమైన ఉల్లి కాకుండా కుళ్లిన ఉల్లిని ఎవరు కొనుగోలు చేయడం లేదని తెలిపారు. ఉల్లిని విక్రయించేందుకు వ్యాపారులు సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట డీడీ పాపారావు, ఏడీ సునీల్, తాడేపల్లిగూడెం ఎఎంసీ కార్యదర్శి గౌస్‌భాషా, సూపర్‌వైజర్ ఫణికిషోర్, సిబ్బంది ఉన్నారు.

15 లారీల్లో తీసుకొచ్చిన కర్నూలు రైతులు

మార్క్‌ఫెడ్ పంపించిన నిల్వలతో పాటు కర్నూలు రైతులు కూడా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు 15 లారీల ఉల్లిని మంగళవారం తెచ్చారు. స్థానికంగా ఉండే కొంతమంది వ్యాపారుల వద్దకు తీసుకొచ్చారు. నాణ్యతను బట్టి క్వింటా రూ.600 నుంచి రూ.1250 మధ్య ధర పలికింది.





ఒక్క క్షణం..

ఆలోచిస్తే నిండు జీవితం

ఒక్కక్షణం ఆవేశం.. అనాలోచిత నిర్ణయంతో నిండుప్రాణం బలైపో తుంది. కుటుంబం వీధిన పడుతుంది. సమస్యలకు చావు ఎంత మాత్రం పరిష్కారం కాదు. అప్పుల భారం.. ప్రేమ విఫలం.. భార్యాభర్తల మధ్య స్వల్ప మనస్పర్ధలు.. తల్లి దండ్రులు మందలించారని పిల్లలు.. పరీక్షలో ఫెయి లైన విద్యార్థులు.. చావే పరిష్కారంగా భావిస్తే సమాజ మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. బుధవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా..

నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

- చిన్న కారణాలతో ఆత్మహత్యలు
- క్షణికావేశం.. ఒత్తిడితో మృత్యుఒడికి
- పెరుగుతున్న మరణాల సంఖ్య
- ఆధారం కోల్పోతున్న కుటుంబాలు
- పరిష్కారం దిశగా ఆలోచించాలి

“ పెదనింద్రకొలను గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్వా చెరువులు దెబ్బ తినడంతో నష్టాలపాల య్యాడు. అప్పులు తీర్చలేక ఎకరం, ఇల్లు అమ్మేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో ఒత్తిడి భరించలేక పోయాడు. సాగుచేస్తున్న రొయ్యచెరువు వద్దే గ్యాస్ బిళ్లలు మింగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య, కొడుకు, కుమార్తె రోదన వర్ణనాతీతం.

“ ఇంటర్ చదువుతున్న పెంటపాడుకు చెందిన యువకుడు, గణపవరం సమీప గ్రామానికి యువతి ప్రేమించుకున్నారు. ఇద్దరికీ పెళ్లి చేసుకునే వయసు రాలేదు. పైగా వేర్వేరు కులాలు కావడంతో పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీనితో యువతి ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కళ్లెదుటే ప్రియురాలు చనిపోవడం తట్టుకోలేని యువకుడు ప్రాణం తీసుకున్నాడు. కైకరం రైల్వే పట్టాలపై పడుకొని తండ్రితో ఫోన్‌లో మాట్లాడాడు. ప్రాణం తీసుకోవద్దని తండ్రి ఎంత వారించినా.. నచ్చజెప్పినా.. బతిమిలాడినా.. బలవంతంగా ప్రాణం తీసుకున్నాడు. యువతీ యువకులు ఇద్దరి కుటుంబాల్లో తీరని విషాదం నింపారు.

“ ముదినేపల్లి మండలం వడలి గ్రామానికి చెందిన యువకుడు కొంత కాలంగా కూలి పనులకు వెళ్లకుండా జులాయిలా తిరుగుతున్నాడు. చెడు తిరుగుళ్లు వద్దని తల్లి మందలించింది. క్షణికావేశంలో కొడుకు ఎలుకల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేతికందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ తల్లి రోదన తీరనిది.



నిడమర్రు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో తీసుకొన్న నిర్ణయాలతో నిండు జీవితాలు కడతేరి పోతున్నాయి. కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిలిస్తున్నాయి. తల్లిదండ్రులు మందలించారని, పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నామని, ప్రేమ విఫలమైందని, చివరకు తల్లిదండ్రులు సెల్‌ఫోన్ వాడవద్దన్నారని ఆవేశంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇక కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, వ్యసనాలు, భార్యాభర్తల మధ్య గొడవలు వంటి చిన్న చిన్న కారణాలతో ఉద్వేగంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు ఇటీవల అధికమయ్యాయి.

చావు సమస్యకు పరిష్కారం కాదు

ఎంత పెద్ద సమస్య అయినా పరిష్కారానికి ఏదొక మార్గం ఉంటుంది. చిన్నపాటి సమస్యలకే మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్య చేసుకొంటున్న సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఒత్తిడికి గురై క్షణికావేశంలో ఒక్కక్షణం ఆలోచించి పెంచి పెద్ద చేసిన తల్లి దండ్రులు, తమపై ఆధారపడ్డ భార్యపిల్లలను గుర్తుకు తెచ్చుకొంటే మృత్యువు ఊహే రాదు. ఒకరి మృతి మొత్తం కుటుంబాన్ని తలకిందులు చేస్తుంది.

జీవితంపై అవగాహన లేక..

యువతకు సమస్య ఎదురైతే క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. జీవితం, సమస్యపై సానుకూల దృక్పథం లేకపోవడం వల్లే ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్యతో సమస్యల నుండి తప్పించుకోవాలని చూస్తున్నారే కానీ కుటుంబ సభ్యులను మరింత సమస్యలలోకి నెడుతున్నారనే విషయాన్ని గుర్తించలేకపోతున్నారు.

ఒత్తిడితో కూడిన జీవనం

ఆధునిక జీవనం కూడా ఆత్మహత్యలను ప్రేరేపిస్తోంది. చదువుల్లో అనారోగ్యకర పోటీతత్వం, ఉద్యోగ సాధనలో ఒత్తిడి, సంపాదన, ఉద్యోగంలో ఉరుకుల పరుగులు, టార్గెట్‌లతో కూడిన ప్రాజెక్టులు, నష్టాలతో కూడిన వ్యాపారాలతో అన్ని వయసుల వారు అనుక్షణం ఒత్తిడిలో జీవిస్తున్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబంలో సమస్యలను అందరూ కలిసి ఎదుర్కొనేవారు. కుటుంబ పెద్దలు సమస్యల పరిష్కారానికై మేమున్నామంటూ భరోసా ఇచ్చి చక్కదిద్దేవారు. నేడు ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు ఒత్తిడిని దాటలేకపోతున్నాయి. పట్టణాలలో ఒంటరి జీవనంతో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి.

ఏటా 300 పైగా మరణాలు

ఆత్మహత్యకు పాల్పడడం ద్వారా ద్వారా 300 నుంచి 350 మంది మృత్యువాత పడుతున్నారు.

2022 - 310
2023 - 350
2024 - 330
2025 - 140 ఆగస్టు వరకు
(నమోదు కానివి ఎన్నో)



ఆత్మహత్య ప్రేరేపిత లక్షణాలు

- ఎక్కువగా ఒత్తిడికి లోనవుతారు.
- ఎక్కువగా ఒంటరితనాన్ని కోరుకొంటారు.
- ఆహారం సక్రమంగా సకాలంలో తీసుకోరు.
- ప్రతి చిన్న విషయానికి తీవ్రంగా ఆలోచిస్తూంటారు.
- జీవితంలో ఏదో పోగొట్టుకొన్నవాడిలా ఉంటారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- వారితో ప్రేమగా మాట్లాడి సమస్యను తెలుసుకొని మేమున్నామంటూ భరోసా ఇవ్వాలి.
- కుటుంబ సభ్యులు తోడుగా ఉంటూ ఆలోచనా దోరణి మార్చే విధంగా మట్లాడాలి.
- అవసరమైతే మానసిక వైద్యుడి వద్దకు తీసుకొని వెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వాలి.

ఆత్మహత్య ఘోరమైన తప్పిదం



ఆత్మహత్య ఆలోచన ఘోరమైన తప్పిదం. ప్రాణం కన్నా పెద్ద విషయం ఏమీ ఉండదు. ప్రాణాలను పోగొట్టుకొనే సమస్య ఏదీ ఉండదు. పురాణాలు, గ్రంథాలలో ఆత్మహత్య పాపంగా చెప్పబడింది. మనిషి సృష్టించుకొన్న సమస్యలను తానే పరిష్కరించకోగల సామర్థ్యం ఉంటుంది. ఆదిశగా ఆలోచించడం ద్వారా ఆత్మహత్యల ప్రేరణకు దూరం కావచ్చు. ఏవిషయమైనా, సమస్యనైనా బ్రతికే సాధించాలి. చచ్చి సాధించాలనుకోవడం ఓ భ్రమ మాత్రమే.

- బీవీ.కృష్ణారెడ్డి న్యాయవాది, ఏలూరు

మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలు



యువత ఎక్కువగా మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యతో సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జఠిలమవుతాయి. కుటుంబ సభ్యులంతా వెంటనే స్పందించి చిన్నగా ఉన్నప్పుడే సమస్యకు పరిష్కరించుకోవాలి. సమస్యలు ఎదురైనప్పుడు నమ్మకస్తులైన మిత్రల వద్ద చర్చిండం ద్వారా, కుటుంబ సభ్యుల వద్ద చర్చించడం సమస్య ఒత్తిడి నుంచి దూరం చేయబడి ప్రశాంతంగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవచ్చు.

- డి.శ్రావణ్ కుమార్, డీఎస్పీ, ఏలూరు



రామేశ్వరస్వామి సత్రం వద్ద పురందరదాసు కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

నేటి తరానికి పురందర దాసు కీర్తనలు అవసరం

ఆచంటలో రాష్ట్రస్థాయి ఆధ్యాత్మిక సంఘటన

ఆచంట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): పురందర దాసు ప్రపంచమంతా తిరిగి శ్రీకృష్ణుడిని స్తుతిస్తూ హరిదాసు అయ్యాడని, ఆయన కీర్తనలు భక్తిభావం, సులభమైన భాషతో అందరికి అర్థమయ్యేలా ఉంటాయని హరిద్వారలోని ఉడిపి దాస అసిస్టెంట్ డైరెక్టర్ పరాయతం నారాయణచార్యులు అన్నారు. నారాయణ చార్యుల పర్యవేక్షణలో ఆచంటలోని శివ గోపాలం భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి పురందర దాసు ఆధ్యాత్మిక సంఘటన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 భజన మండలి సభ్యులు సుమారు 600 మంది పైగానే మహిళలు పాల్గొన్నారు. ఉదయం వీరంతా ఆచంటేశ్వరుని దర్శించుకున్న అనంతరం నగర సంకీర్తన గావించారు. పురందర దాసు కీర్తరలు ఆలపిస్తూ ఆచంట పుర వీధులలో తిరిగారు. అనంతరం రామేశ్వరస్వామి సత్రంలో ఏకదాటిగా పురందర దాసు కీర్తనలు ఆలపించారు. నారాయణాచార్యులు మాట్లాడుతూ సంగీత పర్వంగా పురందాసు ఎంతో విప్లవాత్మకంగా నిలిచాడని ఆయన కర్ణాటక సంగీత పితామహుడుగా ప్రశిది పొందారన్నారు. పురందర దాసు సుమారు 4 లక్షలకు పైగా కీర్తనలు రచించినట్లు అంచ. వాటిలో సుమారు వెయ్యి కీర్తరలు మాత్రమే మనకు చేరి ఉన్నాయన్నారు. ఆయన కీర్తనలు ప్రజలందరికి తెలియజేయాలన్న సంకల్పంతో ఆంధ్రా, తెలంగాణ, ఒడిశాలలో సుమారు 700 భజన మండలిలు స్థాపించి ఆధ్యాత్మికత వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హరే శ్రీనివాస్, గొర్తి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆచంట శివ గోపాల భజన మండలికి చెందిన గొడవర్తి నాగ శిరోమణి, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన మండలి వారికి జ్ఞాపికలు అందజేశారు.



అవార్డు అందుకున్న క్రీడాకారులు, పాఠశాల సిబ్బంది

ఏఆర్‌డీజీకే పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీవారపు పేటలోని ఏఆర్‌డీజీకే నగర పాలక ఉన్నత పాఠశాలకు 'స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు' లభించింది. జాతీయ క్రీడాదినోత్సవం (ఆగస్టు 29) పురస్కరించుకుని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు మేరకు జిల్లా విద్యాశాఖ ఈ అవార్డు ప్రకటిస్తుంది. 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలను గుర్తించి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును ప్రకటించింది. ఏఆర్‌డీజీకే నగర పాలక ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో మూడో స్థానం లభించినట్లు హెచ్‌ఎం వి.కాంతి జయకుమార్ తెలిపారు. అవార్డును జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డీఈవో వెంకట లక్ష్మమ్మ నుంచి స్వీకరించినట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జోజిబాబు, పీఈటీ శ్రీనివాస్‌కుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ నగీన, తదితరులు అభినందించారు.

వైద్యం చేసేదెలా..?

పీహెచ్‌సీల్లో రోగ నిర్ధారణ పరీక్షలకు సిబ్బంది కొరత

- గ్రామీణ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు లేవు
- అరకొర సిబ్బంది.. డిప్యుటేషన్లు
- ప్రైవేటు ల్యాబ్‌లకు సిఫారసు
- గ్రామాల్లో పేదలకు తప్పని భారం
- జ్వరాలపై అయోమయం



జిల్లాలో రోజుకు సగటున 150 నుంచి 180వరకు జ్వరం కేసులు నమోదవుతున్నాయి. ఏ జ్వరమో నిర్ధారణకు ల్యాబ్ టెక్నీషియన్లు(ఎల్టీలు) లేరు. వైద్య ఆరోగ్య శాఖ ఐహెచ్‌పీ (ఇంటిగ్రేటెడ్ హెల్త్ పోర్టల్)లో క్షేత్రస్థాయి నుంచి రోజువారీ నమోదవుతున్న జలుబు, దగ్గు, జ్వరం, యానిమల్ బైట్స్ వంటి నోటిఫైడ్ డిసీజెస్ నివారించడానికి లేదా నియంత్రించడానికి పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఉంది. ఫలితంగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లవైపు వెళ్లక తప్పడం లేదు.



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో రోగ నిర్ధారణ పరీక్షలకు అవకాశం లేకపోవడంతో వైద్యం అందిచడంలో కచ్చితత్వం లోపిస్తోంది. జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ఏ జ్వరమనేది నిర్ధారణ కావడం లేదు. మరోవైపు విధులు నిర్వర్తించాల్సిన వైద్యులను పట్టణ ప్రాంతాల్లో డిప్యుటేషన్లపై కొనసాగిస్తున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఐదుగురు బఫర్ డాక్టర్లను ఆఫీసు విధులకే పరిమితం చేయడంపైనా వైద్యవర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎల్టీలు లేకుండా రోగనిర్ధారణ ఎలా?

ఏలూరు జిల్లాలో మొత్తం 70 పీహెచ్‌సీలుండగా, వీటిలో 62 పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. ఇవిగాక ఏలూరు, చింతలపూడి, నూజివీడుల్లో 11 అర్బన్ పీహెచ్‌సీలు, దెందులూరు, చింతలపూడి, నూజివీడు, కైకలూరుల్లో సీహెచ్‌సీలున్నాయి. వివిధ రుగ్మతలు, రోగాలతో నిత్యం వేల సంఖ్యలో ప్రభుత్వాసుపత్రులకు వస్తుంటారు. రోగనిర్ధారణ పరీక్షలు చేయడానికి ఉద్దేశించిన ల్యాబ్ టెక్నీషియన్లు పూర్తిస్థాయిలో లేకపోవడం ప్రధాన లోపం. ఈ సమస్యను తాత్కాలికంగా అధిగమించడానికి సమీప పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తించే ల్యాబ్ టెక్నీషియన్లను కొరతవున్న పీహెచ్‌సీలో వారానికి మూడు రోజులు పనిచేసేలా నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఎల్టీ అందుబాటులోలేని మిగతా మూడు రోజుల్లో రోగనిర్ధారణ పరీక్షలు జరగడం లేదు. ఈ పరిస్థితి టి.నరసాపురం, లింగపాలెం, కోరుకొల్లు, కొల్లేటికోట, రాఘవాపురం, మరి కొన్ని పీహెచ్‌సీల్లో ఉన్నట్టు తెలుస్తోంది. వైరల్ జ్వరాలు, అంటువ్యాధుల కేసులు నిత్యం వస్తున్న వేళ కీలకమైన ల్యాబ్ టెక్నీషియన్ల కొరత వేదిస్తుండడం సమస్యను మరింత పెంచుతోంది. కొన్ని పీహెచ్‌సీల్లో రోగనిర్ధారణకు ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

నగరంలోని ప్రైవేటు ల్యాబ్‌కు జ్వరం లక్షణాలతో ఒక వ్యక్తి రోగనిర్ధారణ పరీక్షకు వెళ్లగా అక్కడ సీబీపీ, యూరిన్, ఎలీసా వంటి వైరల్ జ్వర సంబంధిత టెస్టులు చేయకుండానే డెంగీ జ్వరంగా చెప్పడంతో భయభ్రాంతులకు గురైన కుటుంబసభ్యులు రోగిని వైద్యంనిమిత్తం పీహెచ్‌సీకి వచ్చినట్టు ఓ వైద్యాధికారి వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్లను ఎప్పటికప్పుడు భర్తీచేస్తుంటే పీహెచ్‌సీ స్థాయిలోనే రోగనిర్ధారణ, వైద్యం వేగవంతంగా జరుగుతాయని ఆ వైద్యాధికారి అభిప్రాయపడ్డారు. మరోవైపు పలు పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు స్టాఫ్ నర్సుల కొరత వెంటాడుతోంది. ప్రత్యామ్నాయంగా ఏఎన్ఎంలను, ఎంఎల్‌హెచ్‌పీలను వైద్యసేవలకు వినియోగించుకుంటున్నారు.

బఫర్ డాక్టర్లు ఉన్నా..

జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఐదుగురు బఫర్ వైద్యులు ఉన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో డాక్టర్లు సెలవుపెడితే అక్కడ వైద్యసేవలకు విఘాతం కలుగకుండా బఫర్ డాక్టర్లను గతంలోనే నియమించారు. వీరంతా డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో ఉంటారు. ప్రస్తుతం జిల్లాలో పీహెచ్‌సీల్లో వైద్యాధికారుల కొరత ఉంటే, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఐదుగురు బఫర్ డాక్టర్లను వివిధ పథకాలకు పర్యవేక్షకులుగా వినియోగించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. బఫర్ డాక్టర్లను క్షేత్రస్థాయికి పంపిస్తే వైద్య సేవలపై అవగాహన ఉంటుందని, కార్యాలయ విధులకే పరిమితంచేయడం సరికాదని ఓ వైద్యాధికారి వ్యాఖ్యానించారు.

ఎల్టీలు, స్టాఫ్ నర్స్ ఖాళీలు భర్తీచేస్తాం : డాక్టర్ పీజే.అమృతం, డీఎంహెచ్‌వో

జిల్లాలో కనీసం 10 పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత, కొన్నిచోట్ల స్టాఫ్ నర్సుల కొరత ఉంది. సమీప పీహెచ్‌సీల నుంచి ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులను వారానికి మూడు రోజులపాటు సేవలందించేలా చర్యలు తీసుకుంటాం. జ్వరం కేసులు నమోదైనచోట ఆ ప్రాంతంలో అనుమానిత లక్షణాలున్నవారిని గుర్తించేందుకు సర్వే నిరంతరం జరుగుతుంది. జిల్లాలో ఇంతవరకు తురకపాలెం(గుంటూరు జిల్లా)లో నమోదైన జ్వరం తీవ్రత మాదిరి కేసులేవీ లేవు.

15న అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 15న ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ మంగళవారం తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కేవలం ఏలూరు జిల్లాకు చెందినవారు మాత్రమే పోటీలకు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు ఏఎస్ఆర్ స్టేడియంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలకు ఏలూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ప్రసాద్ తెలిపారు. 15న ఉదయం 8గంటల సమయానికి ఏఎస్ఆర్ స్టేడియంలో క్రీడాకారులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, లేదా ఎస్ఎస్‌సి మార్కుల లిస్టు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకొని రావాలని సూచించారు. మరింత సమాచారానికి 8686540555 నెంబర్లను సంప్రదించవలిసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.



చౌక డిపోల్లో

కందిపప్పుకు మంగళం

- ప్రతి నెలా పప్పుకోసం కార్డుదారుల ఆరా
- అడగవద్దంటున్న డీలర్లు
- బహిరంగ మార్కెట్‌లో రూ.వంద పైనే
- పేదలకు పప్పన్నం కూడా భారమే

గణపవరం/అత్తిలి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదలకు పప్పన్నం కరువైంది. రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా చేయడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం కంది పప్పు సరఫరా పూర్తిగా నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు నెలల పాటు సరఫరా చేశారు. తర్వాత బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 5,58,019 రేషన్‌కార్డులు ఉండగా 1052 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్రతీనెల 588 మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. కంది పప్పు ఆరునెలలుగా రావడం లేదని డీలర్లు చెబుతుండడంతో కార్డుదారులు బియ్యం తీసుకుని వెనుదిరుగుతున్నారు. కనీస ధర తక్కువగా ఉన్నప్పుడైన ప్రజలకు అందించేందుక ముందుకు రావడం లేదు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై రేషన్‌షాపుల్లో కందిపప్పు సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. చౌకదుకాణాల్లో కేజీ రూ.67 ధరకు అందించే కంది పప్పును బయట మార్కెట్‌లో రూ.130 - 150 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. డీడీలు తియ్యని డీలర్లు రేషన్‌డీలర్లు ప్రతీనెల 20లోపు డీడీలు తీసి తమ పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు దిగుమతి చేసుకుంటారు. నెలలుగా డీలర్లు డీడీలు తీసుకున్న పౌర సరఫరాల శాఖ మాత్రం అవసరమైన మేరకు కందిపప్పు సరఫరా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కందిపప్పు కోసం డీడీలు తీయ్యవద్దని డీలర్లకు ముందుగానే అధికారులు సమాచారం ఇస్తున్నారు. కార్డుదారులు బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు అడుగుతుంటే తమకే రాలేదని డీలర్లు బదులిస్తున్నారు. వచ్చే నెల కందిపప్పు పంపిణీ చేస్తారా అని డీలర్లను ఆరా తీస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమలు, రాగులు, జొన్నలు పంపిణీ చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం చేస్తున్నా కార్యాచరణకు నోచుకోవట్లేదు.

నక్కపల్లిలో 'ఏఎంఎన్‌ఎస్' భారీ ఉక్కు పరిశ్రమ రాష్ట్రానికి గర్వకారణం : కేంద్ర మంత్రి వర్మ


ఏఎంఎన్‌ఎస్ సీఈవోను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ (ఏఎంఎన్ ఎస్) భారీ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో ఏఎంఎన్ఎస్ సీఈవో దిలీప్ ఊమెన్‌తో పాటు ఇతర ప్రతినిధులు మంత్రి వర్మతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వివరాలను సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరిం చారు. నక్కపల్లి మండలంలోని ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో ఈ స్టీల్ ప్లాంట్‌ను రెండు దశల్లో నిర్మిస్తున్నారు. మొత్తం 17.8 మిలియన్ టన్నుల వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఏఎంఎన్ ఎస్ రూ. 1,35,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీనివల్ల 55వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ప్రాజెక్టు పనులను త్వరగా ప్రారంభించి, నిర్దిష్ట సమయంలో పూర్తిచేయాలని మంత్రి శ్రీనివాస వర్మ ఏఎంఎన్ఎస్ ప్రతినిధులకు సూచించి వారిని సత్కరించారు.

మోదీ పాలనలో దేశం అన్నివిధాలా అభివృద్ధి

» జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు : పాకా


మాట్లాడుతున్న పాకా సత్యనారాయణ

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని, ప్రపంచంలోనే ఇండియా మూడో స్థానాన్ని కైవసం చేసుకుంటుందని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుని అనంతరం కొయ్యలగూడెంలోని ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్‌డీఏ తరఫున ఉప రాష్ట్రపతి పదవికి నిలిచిన రాధాకృష్ణ బీజేపీలో చాలాసీనియర్ కార్యకర్త అని, రెండు పర్యాయాలు గవర్నర్‌గా పని చేసిన అనుభవం ఉందన్నారు. విపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసిన గెలుపు సునాయాసం అన్నారు. జీఎస్టీ ఫలాలు ఏ విధంగా ఉంటాయో ప్రజలకు చూపించిన ఏకైక ప్రధాని మోదీ అన్నారు. ఐదు స్లాబులుగా ఉన్న జీఎస్టీ రెండు స్లాబులుగా మార్చడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు నేరుగా జీఎస్టీ ఫలాలు అందుతున్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొల్లిన నిర్మలకిషోర్, జిల్లా నాయకురాలు ఎస్ఆర్ఆర్. సుభద్రాదేవి, మాజీ సర్పంచ్ నరసింహరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ నాయకులు కారంకి శ్రీనివాస్, కోటిపల్లి నాగు, చిటికన రమేశ్, బొమ్మా బాబు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఏలూరు రైల్వేస్టేషన్‌లో ఒకరి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఏలూరు పవర్‌పేట రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో పడి నోటి వెంబడి నురగలు కక్కుతుండగా రైల్వే పోలీసులు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. ఏలూరు చిట్టివలసపాకల ప్రాంతానికి చెందిన కోరాడ రమేష్(48) కూలి పనులు చేస్తూ అతిగా మద్యం తాగుతూ పవర్‌పేట రైల్వే స్టేషన్‌లోనే కాలం గడుపుతూ ఉంటాడు. అతిగా మద్యం తాగిన అతడు మంగళవారం ఉదయం నోటి వెంబడి నురగలు కక్కుతూ పవర్‌పేట ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై పడి ఉండగా గమనించిన బుక్కింగ్ క్లర్క్ వెంటనే ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

యలమంచిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన కిలారి శ్రీనివాసరావు(39) మృతదేహం చించినాడ వద్ద గోదావరిలో మంగళవారం లభ్యమైందని ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. సోమవారం నుంచి కనిపించకుండా పోయిన ఒక ప్రైవేటు స్కూల్ బస్ డ్రైవరుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు కనిపించికుండా పోవడం, అతడి మోటారు సైకిల్ చించినాడ బ్రిడ్జిపై ఉండడం పాఠకులకు విదితమే. బ్రిడ్జిపై అతడి మోటారు సైకిల్ ఉండడంతో మంగళవారం గోదావరిలో గాలింపుచర్యలు చేపట్టగా మృతదేహం గోదావరిలో లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురి ఉసురు తీసిన వాటర్ ట్యాంకు

» మోటారు ఆన్ చేసేందుకు లోపలికి వెళ్లి దుర్మరణం
» మరో వ్యక్తికి అస్వస్థత.. మృతుల్లో ఒకరిది తణుకు పట్టణం ?

చర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఆ వాటర్ ట్యాంకు ముగ్గురి నిండు ప్రాణాలను బలితీసుకుంది. మోటారు ఆన్ చేసేందుకు ఒకరి తర్వాత మరొకరు దిగి ఊపిరాడక మృతిచెందారు. కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఉంజుపల్లి గ్రామంలో ఈ విషాద ఘటన జరిగింది. మృతుల్లో ఇద్దరు కూలీలు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మృతుల్లో మరొకరు రైతు. ఆ దారిలో వెళుతూ.. ట్యాంకులో ఇద్దరు చిక్కుకున్నారని తెలిసి, వారిని రక్షించేయత్నంలో తాను దిగి ప్రాణాలు కోల్పోయాడు. ఉంజుపల్లిలో మిషన్ భగీరథ పథకం కింద 90 వేల లీటర్ల సామర్థ్యంతో కూడిన వాటర్ ట్యాంకును నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్లాబ్ వేసే పనులు జరుగుతున్నాయి. మంగళవారం ట్యాంకులోని నీటిని తొలగించేందుకుగాను అందులో ఉన్న డీజిల్ మోటారును ఆన్ చేసేందుకు తొలుత నీలం తులసీరాం (37) అనే కార్మికుడు దిగాడు. లోపల ఊపిరాడకపోవడంతో బిగ్గరగా కేకలు వేస్తూ పడిపోయాడు. ఇది గమనించిన కార్మికుడు ఇసాక్(50), అప్పలరాజు అనే ఇద్దరు కార్మికులు లోపలికి దిగారు. ఊపిరాడకపోవడంతో వారూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ ఘటనపై పైన పనులు చేస్తున్న కొందరు కార్మికులు కేకలు వేయడంతో అదే మార్గం మీదుగా తన పత్తిచేనుకు వెళుతున్న కాకా మహేశ్ (36) అనే రైతు, బాధితులను కాపాడేందుకు లోపలికి దిగాడు. ఈ క్రమంలో మహేశ్ కూడా ఊపిరాడక పడిపోయాడు. ఈ ఘటనపై చర్ల పోలీసులకు సమాచారం అందడంతో వారొచ్చి.. నలుగురినీ బయటకు తీశారు. అప్పటికే తులసీరాం, మహేశ్ మృతిచెందారు. అపస్మారక స్థితిలో ఉన్న ఇసాక్, అప్పలరాజును తొలుత చర్ల వైద్యశాలకు.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఇసాక్ మార్గమధ్యలోనే మృతి చెందారు. అప్పలరాజు పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. తులసీరాందీ చర్ల మండలం లింగాపురం గ్రామం. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మహేశ్‌ది చర్ల మండలం ఉంజుపల్లి. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇసాక్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని తణుకుగా తెలుస్తోంది. అతడికి భార్య, పిల్లలున్నారు. చికిత్స పొందుతున్న అప్పలరాజుది కూడా ఏపీలోని కాకినాడ అని తెలుస్తోంది. భగీరథ ట్యాంకు నిర్మాణ పనుల్లో భాగంగా ముగ్గురు వ్యక్తులు మరణించడంతో చర్ల మండలంలో విషాదం నెలకొంది. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, మండల వాసులు చర్లలో ఆందోళన చేశారు.

ఎండు చేపల మార్కెట్ కేరాఫ్ తాడేపల్లిగూడెం

రాష్ట్ర నలుమూలల నుంచి దిగుమతులు

ఆదివారం ఒక్కరోజునే రూ.కోట్లలో వ్యాపారం


తాడేపల్లిగూడెం రిటైల్ మార్కెట్లో ఎండు చేపలు

» విక్రయానికి రకరకాల ఎండు చేపలు
» పరసర ప్రాంతాల వ్యాపారుల కొనుగోలు

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి): చేపల మార్కెట్‌కు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ప్రసిద్ధి. రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడికి రకరకాల ఎండు చేపలు దిగుమతి అవుతుంటాయి. ప్రతివారం ఆదివారం వచ్చిందంటే చాలు.. మార్కెట్ సందడి సందడిగా ఉంటుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని మారుమూల ప్రాంతాల నుంచి రిటైల్ వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్లో 30 వరకు హోల్‌సేల్ ఎండుచేపల షాపులు ఉన్నాయి. ఇవి కాకుండా 15 మంది వరకు రిటైల్ వ్యాపారులు విక్రయాలు చేస్తుంటారు. ఒక్క ఆదివారం రోజునే సుమారు రూ.కోటి వరకు లావాదేవీలు జరుగుతాయి. విశాఖపట్నం, కాకినాడ, అంతిర్వేది, పాతపాడు, మచిలీపట్నం, నర్సాపురం నుంచి ఎండుచేపలు శనివారం సాయంత్రానికి తాడేపల్లిగూడెం మార్కెట్‌కు చేరుతాయి. వ్యాపారం అంతా ఫోన్లలోనే జరుగుతుంది. నాణ్యత, సైజు, రకం వంటి వివరాలు ఫొటోలు తీసి ఇక్కడ వ్యాపారులకు పంపుతారు. వాటిని చూసి ఆర్డర్లు పెడతారు. చూపించిన సరుకులో నాణ్యత లోపిస్తే తిప్పి పంపించేందుకు షరతులు ఉంటాయి. తగిన నాణ్యత ఉంటేనే వాటిని దిగుమతి చేసుకుంటారు. తేడా వస్తే తిరిగి పంపేస్తారు. వ్యాపారులు దీన్ని దృష్టిలో పెట్టుకుని సరుకు పంపిస్తుంటారు. కాగా కరోనా దెబ్బకు ఎండుచేపల వ్యాపారం రోడ్డెక్కింది. అప్పటి వరకు కేవలం సంత ఎక్కడ జరుగుతుందో ఆ ప్రాంతంలోనే విక్రయాలు జరిగేవి. కరోనా నిబంధనల వల్ల మార్కెట్లకు తాకిడి తగ్గింది. దీంతో రోడ్ల పక్కకు రిటైల్ వ్యాపారులు వచ్చేశారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల రహదారుల్లో సుమారు 10 షాపుల వరకు వెలిశాయి. వీరంతా తాడేపల్లిగూడెం ఆదివారం మార్కెట్లో వ్యాపారం చేసేవారే. మిగిలిన రోజుల్లో రోడ్డు పక్కన దుకాణాలు పెట్టి విక్రయిస్తున్నారు.

ఎండు చేపల్లో రకాలు..

ఎండు చేపలను తినేవారు ఒక్కొక్కరు ఒక్కో రకానికి అలవాటుపడతారు. ఇప్పుడు మార్కెట్లో కొరమేను, నెత్తళ్లు, ఉప్పు గొరసలు, సందువాలు, వంజరం, కట్టి పరెగెలు, మాగ, జల్లలు, పండుగప్ప, ఎర్రరొయ్యలు, తెల్లరొయ్యలు అందుబాటులో ఉన్నాయి. వీటన్నిటికన్నా పండుగప్పకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

ధరలు పెరిగాయి.. కొనుగోళ్లు తగ్గాయి



ఎండు చేపల ధరలు పెరిగాయి. దీంతో కొనుగోళ్లు తగ్గాయి. మరో రెండు నెలల్లో ధరలు కొంత తగ్గవచ్చు. చేపల వ్యాపారం విస్తరించింది. రోడ్డు పక్కన చేపల వ్యాపారాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

\- పిప్పర శ్రీను, వ్యాపారి

ఊపందుకున్న దిగుమతులు



దిగుమతులు ఇప్పుడే ఊపందుకుంటున్నాయి. మొన్నటి వరకు వేట నిషేధం కారణంగా సరుకు తక్కువగా వచ్చేది. ఇప్పుడు నిషేధం ముగిసి రెండు నెలలు అవడంతో సరుకు మార్కెట్‌కు వస్తుంది. చేపల వ్యాపారం వల్ల శని, ఆదివారాల్లో మాకు ఉపాధి దొరుకుతుంది.

\- కె.నాగేశ్వరరావు, కూలీ

హోల్‌సేల్ ధరలు ఇలా..

కొరమేను రెక్కలు కిలో రూ.800, నెత్తళ్లు రూ.650, ఉప్పుగొరసలు రూ.250, సందువాలు రూ.300, వంజరం ముక్కలు రూ.500, కట్టిపరెగెలు రూ.450, మాగ రూ.400, జెల్ల రూ.250, పండుగప్ప రూ.650, ఎర్రరొయ్యలు నాణ్యమైనవి రూ.800 నుంచి 1000 విక్రయిస్తున్నారు. రూ.5 కిలోలకు పైగా కొనుగోలు చేసేవారికే ఈ ధరలకు ఇస్తారు. రిటైల్‌గా అయితే కొరమేను రెక్కలు కిలో రూ.1000, నెత్తళ్లు రూ.800, గొరసలు రూ.350, సందువాలు రూ.400, వంజరం ముక్కలు రూ.600, కట్టిపరెగెలు రూ.600, మాగ రూ.500, జెల్ల రూ.300, పండుగప్ప రూ.1000కు విక్రయిస్తున్నారు. పావు కిలో మొదలుకుని విక్రయాలు సాగిస్తారు.

ఇన్‌చార్జి వీసీగా డాక్టర్ గోపాల్ తొలగింపు

సీనియర్ ప్రొఫెసర్ పేరు ఇవ్వాలంటూ ప్రభుత్వ ఆదేశం

భీమవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ డాక్టర్ బి.గోపాల్‌ను బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది. ప్రొఫెసర్ ఆగస్టు 31వ తేదీన పదవీ విరమణ పూర్తి చేసుకోవడంతో ఇన్‌చార్జి వీసీగా కూడా బాధ్యతలు పూర్తయినట్టేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త ఇన్‌చార్జి వీసీని నియమించేందుకు సీనియర్ ప్రొఫెసర్ పేరును పంపాలంటూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీచేసింది. దాంతో ఉద్యాన విశ్వ విద్యాలయ ఇన్‌చార్జి వీసీ వివాదానికి తెరపడినట్టయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డాక్టర్ బి.గోపాల్‌ను ఇన్‌ఛార్జ్ వీసీగా ప్రభుత్వం నియమించింది. ఆగస్టు 31నాటికి గోపాల్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. ప్రొఫెసర్‌గా 65 ఏళ్ల కొనసాగించాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబరు 10వ తేదీన హైకో ర్టులో వాయిదా ఉంది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. దాని ఆధారంగా ఆగస్టు 31 తర్వాత కూడా విశ్వ విద్యాలయంలో ఇన్‌చార్జి వీసీగా డాక్టర్ గోపాల్ బాధ్యతలు నిర్వహించారు. సెప్టెంబరు 8న కూడా విధుల్లో ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో మంగళవారం నుంచి విధులకు హాజరుకాలేదు. దాంతో ఇన్‌చార్జి వీసీ వివాదానికి తెరపడింది.


మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్లు తప్పనిసరి

నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అన్ని అనుబంధ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌లు తప్పనిసరిగా ఉండాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ స్పష్టం చేశారు. అలాగే వర్సిటీ నిర్వహించే సమావేశాలకు గైర్హాజరైన కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన వర్సిటీ క్రీడాబోర్డ్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీడీలు లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ పరిధిలో సుమారు 400 అనుబంధ కళాశాలలు ఉండగా వాటిలో ఎక్కువ కళాశాలలకు పీడీలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. నేటిప్రపంచంలో శారీరక వ్యాయామం లేక ఎక్కువ మంది విద్యార్థులు స్థూలకాయంతో అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. తాము విశ్వవిద్యాలయం నుంచి ఆకస్మిక తనిఖీలు చేపట్టి పీడీలు లేని కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 2024-25 విద్యాసంవత్సరంలో కళాశాలల వారీ సాధించిన పతకాలు, క్రీడాకారుల వివరాలను ప్రస్తావించి అభినందించారు. ఆలిండియా, సౌత్‌జోన్ పోటీల్లో ఎక్కువ పతకాలు సాధించిన కళాశాలకు రూ.10 వేలు నగదు బహుమతితోబాటు పీడీకి గౌరవ పురస్కారాలు అందిస్తామన్నారు. క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య కేవీ స్వామి 2025-26 సీజన్‌లో అంతర్ కళాశాలలు, అంతర్ విశ్వవిద్యాలయాల జట్టు ఎంపికల నిర్వహణపై పీడీలతో చర్చించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ తరఫున వీసీని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, సీడీసీ డీన్ ఎ.మట్టారెడ్డి, విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య అధ్యాపకులు, పీడీలు, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పూరిపాక దగ్ధం

» భయాందోళనలో మొగల్తూరు గ్రామస్థులు
» డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ బృందాల పరిశీలన

మొగల్తూరు. సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు ప్రజల గ్రామదేవత.. నడివీధి ముత్యాలమ్మ పూరిపాక సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా కొలవడంతో ఈ దుర్ఘటన వల్ల గ్రామానికి ఎటువంటి కీడు జరుగుతుందోనని భక్తులు, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యుడు గురుజు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమాచార సేకరణలో నిమగ్నమ య్యారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేద, సీఐ బి.యాదగిరి, ఎస్ఐ జి.వాసులు సమీపంలోని దుకాణాలకు చెందిన సీసీఫుటేజీలు పరిశీలించగా అర్ధరాత్రి 12.40 నిమిషాల అనంతరం జరిగినట్టుగా గుర్తించినప్పటికీ పూర్తి సమాచారం కాన రాలేదు. పోలీస్ అధికారులు, భీమవరం నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించారు. గ్లోరీ అనే క్రైమ్ డాగ్ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మూడు సార్లు తిరిగి అమ్మవారి ఆలయం వెనుక సందులో గల ఆర్‌సీఎం ఆసుపత్రి వరకు వెళ్లి తిరిగి వచ్చింది. క్లూస్ టీమ్ సభ్యులు ఆలయం వద్ద నమూనాలు సేకరించారు. పూరిపాక దగ్ధమైన కారకులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ సభ్యులు డిమాండ్ చేశారు.

● భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, సమరత సేవా ఫౌండేషన్ సభ్యులతో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ తదితరులు ఆలయ ప్రాంతానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రజలంతా శాంతియుతంగా ఉండాలని కోరారు. విద్యుత్ శాఖ, అగ్నిమాపకశాఖాధికారులు, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్, డిప్యూటీ ఎంపీడీవో నవీన్‌కిరణ్, తదితర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సమీక్షించారు. ప్రముఖ సిద్ధాంతి పెద్దింటి అనీల్‌కుమార్ ఆచార్యులు ఆలయాన్ని సందర్శించి సూచనలు చేశారు. విజయదశమి నాటికి తిరిగి అమ్మవారిని పునఃప్రతిష్ఠ చేసేవిధంగా ప్రత్యేక హోమాలు చేయాలని నిర్ణయం చేశారు.



మొగల్తూరులో ముత్యాలమ్మవారి పూరిపాక.. దగ్ధమైన దృశ్యం

ప్రజలంతా సహకరించాలి : ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేద

అనంతరం విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేద మాట్లాడుతూ ఈ ఘటన సెంటి మెంట్‌తోపాటు సున్నిత అంశం కావడంతో గ్రామస్థులు భయాందోళన చెందవద్దని, ప్రజలంతా సమన్వయంతో పోలీసులకు సహకరించాలని, పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సీసలిలో 144 సెక్షన్ అమలు

కాళ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):కాళ్ల మండలం సీసలి గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మంగళవారం నుంచి 15 రోజులపాటు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, తహసీల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు. సీసలిలో గ్రామ దేవత పోలేరమ్మ గుడిపక్కన ఉన్న పోరంబోకు స్థలం విషయమై సోమవారం రాత్రి జరిగిన విషయంలో పలువురికి గాయాలైన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల పెద్దలతో పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు శాంతి సమావేశం నిర్వహించారు. సదరు వివాదాస్పద భూమిని ఇరిగేషన్ అధికారులు స్వాధీనపరచుకోవాలని ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్‌కు తహసీల్దార్ సూచించారు. దీనిలో భాగంగా ఎటువంటి గొడవలు పడకుండా శాంతియుతంగా ఉండాలని ఇరువైపుల వచ్చిన పెద్దలకు సూచనలు చేశారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఆకివీడు సీఐ ఆధ్వర్యంలో గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో ఎక్కడా గుంపులు గుంపులుగా గాని, ఐదుగురికంటే ఎక్కువ వ్యక్తులుగాని ఉండరాదని స్పష్టం చేశారు. బయట నుంచి వచ్చి గ్రామంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

డ్వాక్రా సొమ్ములు గోల్‌మాల్ ?

» అడవికొలనులో ఘటన » ఎనిమిది నెలల సొమ్ము రూ.1.60 లక్షలు గల్లంతు



డ్వాక్రా సభ్యులు చూపిస్తున్న రసీదులలో ఒకటి

నిడమర్రు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళల సొమ్ము గోల్‌మాల్ అయినట్టు తెలిసింది. వివరాలివి.. గ్రామానికి చెందిన పదిమంది డ్వాక్రా మహిళా సభ్యులు 'సరోజని స్వయం సహాయక సంఘం' పేరుతో గణపవరం ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా రుణం తీసుకున్నారు. ఇటీవల డ్వాక్రా గ్రూపు అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకోగా గత ఎనిమిది నెలల నుంచి తాము కట్టిన సొమ్ము నెలకు రూ.20 వేలు చొప్పున మొత్తం ఒక లక్షా 60 వేల రూపాయలు సొమ్ము జమకాలేదని తేలింది. ఈమేరకు గ్రూపు సభ్యులు, బ్యాంకుకు, డ్వాక్రా ఆఫీసుకు పరుగులు పెట్టారు. దీనికి ఆధారంగా రసీదులు ఉన్నాయని తెలియజేస్తున్నారు. సదరు ఎస్‌బీఐ కియోస్క్ సెంటర్ నిర్వాహకులను సంప్రదించగా ఈ రసీదుల తమవి కావని ఈ సొమ్ములు తమ సెంటర్‌లో కట్టలేదని చెబుతున్నారు. ఈ విషయమై గణపవరం బ్యాంకు మేనేజర్ రాజేష్ వద్ద విచారణ చేపట్టగా డ్వాక్రా గ్రూపు అప్పు, పొదుపు సొమ్ములు ఈ సెంటర్‌లోనే కట్టామని చెబుతున్నారు. బ్యాంకు మేనేజర్ స్పందిస్తూ సొమ్ములు జమకాని మాట వాస్తవమేనని ఎక్కడ కట్టారో తేలాలన్నారు. ఈ విషయమై డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారని, విచారణ నిమిత్తం బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. విచారణ అనంతరం బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు డ్వాక్రా గ్రూపు సభ్యులు నిడమర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు కూడా విచారణ చేస్తున్నారు.


న్యాయం చేయండి



మా సరోజని డ్వాక్రా గ్రూపునకు సంబంధించి యానిమేటర్లు వెరిఫికేషన్ చేస్తుండగా అప్పు జమ చేయడం లేదని నిలదీయగా తాము నెలనెలా సొమ్ము భువ్వనపల్లి ఎస్‌బీఐ కియోస్క్‌కి జమ చేస్తున్నామని చెప్పాం. ఆ రసీదులను బ్యాంకుకు తీసుకుని వెళ్లి పరిశీలించగా అవి అన్నీ డూప్లికేట్ అని తేలింది. ఈ విషయంపై జరిగిన మోసాన్ని విచారణ చేసి సభ్యులకు న్యాయం చేయాలి.

\- అంబటి విజయలక్ష్మి
గ్రూపు లీడర్-1, అడవికొలను

గ్రూపు సభ్యుల ఆరోపణలు అవాస్తవం



అడవికొలను సరోజని గ్రూపు సభ్యులెవరూ ఇప్పటి వరకు నా సెంటర్‌లో డ్వాక్రా సొమ్ములు జమ చేయలేదు. వారు చూపిస్తున్న రసీదులు నా సెంటర్‌కు సంబంధించినవి కాదు. నా సెంటర్‌కోడ్ అందులో లేదు. గ్రూపు సభ్యులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం.

సీహెచ్, బాలకృష్ణ ఆంజనేయవాసు
ఎస్‌బీఐ కియోస్క్ నిర్వాహకుడు. భువ్వనపల్లి

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి 20 రోజుల జైలు శిక్ష

భీమడోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి బైక్ నడుపుతున్న వ్యక్తికి 20 రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఇటీవల హైవేపై నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో భీమడోలుకు చెందిన పిల్లి అజయ్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఏలూరు ఫస్ట్ స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కేవీఆర్ మహేశ్వరి ముద్దాయికి 20 రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

12న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు : సీఈవో

ఏలూరుసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఈనెల 12న నిర్వహిస్తామని జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు జడ్పీ కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు నోటిఫికేషన్ రద్దు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో కాంట్రాక్టు ప్రాతిపదికన పోస్టులు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఈ ఏడాది ఆగస్టు 30న జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేశామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరిపాలనా కారణాల వల్ల ఈ నోటిఫికేషన్ రద్దు చేశామని అభ్యర్థులు గమనించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీ ఆసుపత్రిలో షార్ట్ సర్క్యూట్.. తప్పిన ముప్పు


బయటకు పరుగులు తీస్తున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ ఆసుపత్రి భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి ఆసు పత్రి భవనంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. ప్రమాదాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది మెయిన్ ఆఫ్ చేశారు. ఈ ఘటనలో విద్యుత్ వైర్లు దగ్ధమవ్వడం మినహా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని ట్రిపుల్ ఐటీ అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు సభ్యుని పదవిని స్వీకరించలేను : మాజీ ఎమ్మెల్సీ అంగర



పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయని, అయితే ఈ పదవిని తాను స్వీకరించలేక పోతున్నానని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాసినట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తెలిపారు. మంగళవారం పాలకొల్లులోని నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి సామాన్య కార్యకర్త స్థాయి నుంచి నేటి వరకు పార్టీ ఉన్నతికి కష్టపడి పనిచేస్తున్నాను. పార్టీ తనను ఆదరించి మండల పరిషత్ చైర్మన్‌గా రెండు పర్యాయాలు, జడ్పీ వైస్‌చైర్మన్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పించడంతో పాటు ప్రభుత్వ విప్‌గా కూడా పార్టీ నియమించిందన్నారు. అయితే పదవి లేకున్నా ఊపిరి ఉన్నత వరకు పార్టీ కోసం సీఎం చంద్రబాబు నాయుడు, యువనేత మంత్రి లోకేశ్ నాయకత్వంలో పూర్తిస్థాయిలో పనిచేస్తానని లేఖలో పేర్కొన్నారు.

నిట్‌లో 'దక్షిణాపథ్ సమ్మిట్' పోస్టర్ ఆవిష్కరణ


సమ్మిట్ పోస్టర్లను ఆవిష్కరించిన ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యమే సమ్మిట్ ముఖ్య ఉద్దేశమని ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి అన్నారు. థింక్ ఇండియా ఆధ్వ ర్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో తమిళనాడులోని ఐఐటీ మద్రాసులో నిర్వహించనున్న దక్షిణాపథ్ సమ్మిట్ పోస్టర్‌లను మంగళవారం ఏపీ నిట్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా దేశంలోని ప్రజానికం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సామాజిక ఆర్థిక సాంకేతిక సవాళ్లను పరిష్కరించడమే సమ్మిట్ ముఖ్య ఉద్దేశమన్నారు. కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం, యువత సృజనాత్మక ఆలోచనలు ప్రతిభను సద్వినియోగం చేసుకుని దేశాన్ని ప్రపంచదేశాలకు దీటుగా పురోగతి వైపు నడిపించడం వంటి అంశాలపై నిపుణులు చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి, అసోసియేట్ డీన్‌లు డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ కార్తికేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

12న ఏలూరు కలెక్టరేట్‌లో దిశ సమావేశం

ఏలూరుసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం ఈ నెల 12వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేశ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ , జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని వివరించారు.

నిబంధనల మేరకే పిల్లల దత్తత జరగాలి

ఏలూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పిల్లల దత్తత నిబంధనల మేరకు జరగాలని, మిషన్ వాత్సల్య పథకం అమలుకు సమన్వయంతో పనిచేసి ఎక్కువ మందికి లబ్ది చేకూర్చాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నిరాదరణకు గురైన బాలలకు రక్షణ కల్పించి చివారికి మిషన్ వాత్సల్య కింద విద్య, ఆరోగ్యం అందించాలన్నారు. ఇప్పటి వరకు సీడబ్ల్యూసీ ఏలూరు ముందు హాజరు పరిచిన పిల్లల వివరాలను ఆరా తీశారు. ఐసీడీఎస్ పీడీ పి.శారద, సీడబ్ల్యూసీ చైర్మన్ పుచ్చల వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలపై చీఫ్ సెక్రటరీకి వినతి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రెవెన్యూ అధికారి జి.జయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలు పని ఒత్తిడితో సతమతమవుతున్నారని సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు, హైస్ సైట్స్, ఎంక్వైరీలు, రేషన్ కార్డులు పంపిణీ, రీ సర్వే, పీజీఆర్ఎస్, ఇతర రెవెన్యూ విధుల విషయంలో సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. 15 రోజుల సర్వే ట్రైనింగ్ ఇచ్చి వెంటనే సర్వే ఎగ్జామ్స్ నిర్వహించాలని, సర్వే ఎగ్జామ్స్‌లో ఫెయిల్ అయిన వారికి సప్లిమెంటరీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె స్పందించి ఆదేశాలు ఇచ్చారని రవీంద్రరాజు తెలిపారు. మిరియాల లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, జయరాంలు ఆమెను కలిశారు.

గ్రామాల్లో పారిశుధ్యం పరిశీలన

లింగపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డీపీవో అనూరాధ సూచించారు. మండలంలోని రంగాపురంలో మంగళవారం శానిటేషన్ పనులను పరిశీలించారు. గ్రామాలను శుభ్రంగా ఉంచాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచెయ్యాలన్నారు. సురక్షిత తాగునీటి సమస్యలు తలెత్తకుండా వాటర్ ట్యాంకులు, పైపులైన్ల లీకేజీలను పరిశీలించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, పంచాయతీ కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఎన్నికలు నిర్వహించిన ఉపాధ్యాయులు, పాల్గొన్న విద్యార్థినులు

తిరుమలంపాలెంలో ఉత్కంఠగా ఎస్పీఎల్ ఎన్నికలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలంపాలెం జడ్పీ పాఠశాలలో ఎస్‌పీఎల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. లీడర్‌షిప్ కోసం ఏడుగురు పోటీ చేయగా 108 మంది విద్యార్థుల్లో 86మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోషల్ టీచర్ హేమలత ఎన్నికల నిర్వహణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించి విద్యార్థులకు ఎలక్షన్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియపై అవగాహన కల్పించడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే ఈఎన్నికల నిర్వహణ ముఖ్య ఉద్దేశమని హెచ్ఎం శేషుకుమారి పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో కాట్రు చంటిబాబు 49 ఓట్లతో ఎస్పీఎల్‌గా విజయం సాధించగా గుత్తుల దేవిసత్య 16 ఓట్లతో ఆ తరువాత స్థానంతో డిప్యూటీ ఎస్‌పీఎల్‌గా ఎన్నికయ్యారు. వీరిని హెచ్ఎం శేషుకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఫణికుమార్, రమేశ్, రాజేశ్వరమ్మ, మధు, శ్రీదేవి, ఆదినారాయణలు అభినందించారు.

12న హెచ్‌సీఎల్‌లో ఉద్యోగాలకు ఎంపిక పరీక్ష

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 12న ఏలూరు ఎన్ఆర్ పేటలోని ఎన్నారై డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం, ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఇంటర్ 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులై, కనీసం 75శాతం మార్కులతో మ్యాథ్స్ సబ్జెక్టుతో ఎంపీసీ, ఎంఈసీ, ఒకేషనల్, మ్యాథ్స్‌లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని వివరించారు. అవగాహన కార్యక్రమానికి హాజరయ్యేముందు విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కెరీర్ యాప్టిట్యూడ్ టెస్టు, ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆరునెలల శిక్షణ, ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అనంతరం పూర్తిస్థాయి ఉద్యోగిగా నియమిస్తామన్నారు. పూర్తివివరాలకు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ ప్రతినిధి సాయికిరణ్‌ను 96429 73350లో సంప్రదించాలని కోరారు.

సేవా పక్వాడను జయప్రదం చేయండి

ఏలూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి నరేంద్రమోదీ పుట్టినరోజు జరిగే అక్టోబరు 2 వరకు సేవా పక్వాడను జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ ఆధ్వర్యంలో సేవా పక్వడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 15 రోజుల పాటు పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నేతలు కోరారు. మాజీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరెళ్ల సుధాకర్ కృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ కట్నేని లక్ష్మీప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపాటి సత్యనారాయణ, నివాస్‌లు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ గెలుపుపై ఎంపీ హర్షం

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతిగా ఎన్‌డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందడంతో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొని తన ఓటుహక్కును వినియోగించున్నట్టు ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వైసీపీ ధర్నా గురించి మాట్లాడుతూ ఉనికి కోసమే జగన్ డ్రామాలాడుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో కావల్సినంతా యూరియాను కేంద్రం సరఫరా చేస్తుందన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

అన్ని మండలాల్లోనూ యూరియా ఉంది : బాషా

పెదవేగి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటల అవసరాలకు సరిపడా యూరియా అన్ని మండలాల్లోనూ సమృద్ధిగా ఉందని ఏలూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్కే.హబీబ్ బాషా అన్నారు. ఎరువుల వినియోగంపై పెదవేగి మండలం ముండూరు సొసైటీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎరువులు వినియోగం, ఏఏ పంటలకు ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వినియోగించాలి.. అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మహిళల పండుగ... ఉండ్రాళ్ల తద్దె నేడు


ద్వారకాతిరుమల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమైన పండుగలన్నీ కూడా దక్షిణాయన పుణ్యకాలంలోనే వస్తాయి. ఈ క్రమంలో స్త్రీలు విశేషంగా చేసుకునే వ్రతమే ఉండ్రాళ్ల తద్ది లేదా ఉండ్రాళ్ల తదియ అంటారు. దీనిని వర్ష రుతువు, భాద్రపద మాసంలో కృష్ణపక్షం తదియ తిది నాడు అంటే బుధవారం జరుపుకుంటారు. ఈనోమును సాక్షాత్తు శివుడే స్వయంగా పార్వతీదేవికి చెప్పాడని పురాణాలు చెబుతున్నాయి. కన్యలు ఆచరిస్తే మంచి భర్త లభిస్తాడని, పెళ్లయిన స్త్రీలు ఆచరిస్తే తమ సౌభాగ్యం కోసం, సంతానం ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్మకం.

జీవో తెచ్చిన తంటా!

(5వ పేజీ తరువాయి)

అప్రూవల్ చేసేవారు. భవనం ప్లాన్ ప్రకారం కట్టకపోతే మున్సిపల్ అధికారులే జరిమానాలు విధించడం, డివి యేషన్ అయిన భాగాన్ని తొలగించడం చేసేవారు. ఇప్పుడు ఆ బాధ్యతలన్ని ప్రైవేటు ఎల్‌టీపీ లకు కట్టబెట్టడంలో ప్రభుత్వ అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రజలకు మేలు చేసేందుకే జీవో తెచ్చినట్టు చెబుతుంది. గతంలో నిర్మాణదారుడు ఒక ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని బాధ్యతలన్నీ ఎల్‌టీపీల మీద మోపింది. దీంతో ఎల్‌టీపీల యూనియన్లు మీటింగులు పెట్టుకుని ప్రభుత్వ నిబంధనలు సవరించే వరకు ప్లాన్‌లు గీయడం, అప్రూవల్ చేయవద్దనే నిర్ణయానికి వచ్చారు. అయితే జీవోలో ప్రభుత్వం కొన్ని సవరణలు చేసినా ఎల్‌టీపీలు సంతృప్తి చెందలేదు. మరిన్ని సవరణలు చేయాలని ప్రభుత్వానికి ఎల్‌టీపీలు విన్నవించుకున్నారు. ప్రభుత్వం ఎల్‌టీపీల డిమాండ్లను పరిశీలిస్తుంది.

ఎల్‌టీపీలు ముందుకు రండి : భానుప్రతాప్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్



ప్రజాప్రయోజనాల దృష్ట్యానే ప్రభుత్వం స్వీయసర్టిఫికేషన్ 2025 జీవో నంబర్ 20ని తీసుకొచ్చింది. నిబంధనలు సరళతరం చేసి త్వరితగతిన నిర్మాణదారులకు ప్లాన్ అప్రూవల్ చేయడానికి ఈ జీవోను తీసుకొచ్చింది. ఎల్‌టీపీలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ఇప్పటికే కొంత మంది ఎల్‌టీపీలు ముందుకొస్తున్నారు. మిగిలినవారు ముందుకొచ్చి ప్లాన్‌లు అప్రూవల్ చేయాలి. భవనాలు నిర్మించుకునే యజమానులు ప్లాన్ ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి. ఎటువంటి డివియేషన్లు లేకుండా భవనాలు నిర్మించుకోవాలి. ప్రభుత్వం ఇప్పటికే జీవో 20లో ఎన్నో సవరణలు చేసింది.

అంధకారంలో అవుట్ ఫాల్ స్లూయిజ్

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

పోలవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ చీకటి పడితే అంధకారంతో రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారిపోయిందని పట్టిసీమ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొవ్వాడ కాలువ నుంచి కొండవాగుల జలాలు పట్టిసీమ, పాతపట్టిసీమ గ్రామాలకు మధ్యలో ఉన్న కాలువలో ప్రవహించి అక్కడి నుంచి కొత్తపట్టిసీమ పంట పొలాల కాలువలకు చేరేది. వర్షాలు అధికంగా కురిసి కొండవాగులు పొంగిన క్రమంలో ప్రగడపల్లి నుంచి కొత్తపట్టిసీమ వరకూ కొవ్వాడ కాలువ గట్లు తెగి గండ్లు పడి కాలువకు ఇరువైపులా ఉన్న పంటపొలాలు నీటమునిగి ఇసుక మేటలు వేసి రైతులు పంటలు నష్టపోయేవారు. అప్పట్లో ప్రస్తుత జనసేన నేత కరాటం రాంబాబుకి రైతులు తమ పరిస్థితి వివరించగా ఆయన ప్రభుత్వ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ముంపు పరిస్థితిని అధిగమించడానికి జల వనరుల శాఖ అధికారులు గత 15 ఏళ్ల క్రితం పట్టిసీమలో అవుట్ ఫాల్ స్లూయిజ్ వంతెన నిర్మించారు. అప్పటి నుంచి కొవ్వాడలో కొండవాగుల జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో 23 గేట్ల ద్వారా నేరుగా గోదావరిలో కలిసిపోయేవి. పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ వంతెనపై వాహనాలు రాకపోకలు సాగించేందుకు మార్గం కనిపించడానికి 9 లైట్లు వేశారు. అవి గత 6 నెలలుగా వెలగకపోవడంతో అవుట్ ఫాల్ స్లూయిజ్ వంతెనకు ఇరువైపులా ఎస్ ఆకారం మలుపులు ఉండడంతో అంధకారంలో వాహనదారులు వంతెనపై తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వాహనదారులు కోరుతున్నారు.


వెలగని లైట్లతో పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్

యూరియా కోసం ఆందోళన వద్దు


భీమడోలులో ఎరువులు పరిశీలిస్తున్న ఏవో ఉషారాణి

దెందులూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఎరువుల కొరతపై వైసీపీ దుష్ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని దెందులూరు టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్(మిల్లుబాబు), తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణతో కలిసి మీడియాతో మాట్లాడారు. సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి, యలమర్తి శ్రీనివాస్, డాక్టర్ పసుమర్తి మధుబాబు, బోడేటి మోహన్ బాబు, వెలమాటి అనిల్ కుమార్, పూజారి వెంకటరత్నం నాయుడు, కూచిపూడి బాబి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, వెన్నమనేని రాజా పాల్గొన్నారు.

● పోలవరం: ఎరువుల కొరత పేరిట వైసీపీ విష ప్రచారం చేయడం సరికాదని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు హితవు పలికారు. రైతులకు సరిపడా ఎరువులు ఇప్పటికే దిగుమతి అయ్యాయని, వైసీపీ కావాలనే విష ప్రచారం చేస్తోందన్నారు. మండలానికి ఇప్పటికే 594 మెట్రిక్ టన్నులు వచ్చాయని, మరో 43 మెట్రిక్ టన్నులు రానున్నాయన్నారు. ఇంకా 310 మెట్రిక్ టన్నులు అవసరం ఉందన్నారు. ఎరువుల కొరత ఎక్కడా లేదని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. ప్రగడపల్లి సొసైటీలో ఎరువుల కొరత విషయమై రైతులు ధర్నాకు దిగడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వింజరం రైతులు కూడా ఎరువులు ప్రగడపల్లి నుంచి తీసుకెళ్లడంతో కొరత ఏర్పడిందని, మరో 43 మెట్రిక్ టన్నులు దిగుమతి చేస్తున్నట్టు తెలిపారు.

● పెదపాడు: రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామ్ ఖాసిం తెలిపారు. పెదపాడు సొసైటీలో జరుగుతున్న ఎరువుల పంపిణీని మంగళవారం ఆయన పరిశీలించారు మంగళవారం సొసైటీకి 12.5 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. అవసరమైన రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. సొసైటీ సీఈవో డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

● భీమడోలు: యూరియా అందుబాటులో ఉందని ఏవో ఉషారాణి అన్నారు. మండలంలోని పలు సొసైటీలు, ప్రైవేటు డీలర్ల దుకాణాల్లో ఏవో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలో 90 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: మండలంలో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏవో కళింగ గంగాధరం అన్నారు. పి.రాజవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ దర్భగూడెంలో 25, కామయ్యపాలెం డీసీఎంఎస్‌లో 20, ములగలంపల్లిలో 15 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యాన అధికారిణి నవీనమాల, వి.హెచ్.ఎ. ప్రియాంక, ఎ.హెచ్.ఎ. ఫరీద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఆయిల్‌పాం తోటలకు సమతుల్యంగా ఎరువులు వేసుకోవాలని,జీవన, సేంద్రియ ఎరువులను కూడా రైతులు వినియోగించాలని జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్‌రావు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంటలో యూరియా పంపిణీపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యూరియా కొరత లేదని భీమడోలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఉషరాజకుమారి భరోసా నిచ్చారు. జి.కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు రేగంటి రాంబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పోతన ధర్మరాజు, కోటగిరి వేణుగోపాలరావు, ఉద్యాన అధికారి అమర్నాథ్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి పీఏఐ ఒక సాధనం

ఏలూరుసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి, పారదర్శకపాలన, ప్రజల భాగస్వామ్యం కోసం పీఏఐ (పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్) ఒక ముఖ్యమైన సాధనమని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జడ్పీ కార్యాయలం సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ శిక్షణా కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సూచిక ద్వారా పంచాయతీల పరిపాలన, వనరుల వినియోగం, సేవల అందజేత, సామాజిక ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు అంచనా వేస్తారన్నారు. దీంతో పంచాయతీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడుతుందన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డీపీవో కె.అనూరాధ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

హెల్త్ పాలసీతో అందరికీ ఆరోగ్యం

పెదవేగి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైద్యానికి సొమ్ము లేదని ఇకపై ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఆరోగ్య భరోసా అందతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కలిసి, ఆరోగ్య సమస్యలను వివరించి, ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రభాకర్.. వైద్యానికి సంబంధించి ఇకపై ప్రజలెవ్వరూ ఆందోళన పడనవసరంలేదన్నారు. ప్రభుత్వం యూనివర్సల్ హెల్త్ పాలసీని ప్రవేశపెట్టిందని, ప్రతి కుటుంబానికి రూ.25లక్షలు ఆరోగ్య భరోసా లభిస్తుందని చెప్పారు. ఈ పథకంలో 3257 వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఇదొక గొప్ప పథకమని, ఈ పథకం ద్వారా పూర్తి ఉచితంగా, కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టల్ కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద జంట నాగుల విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఊటుకూరి సాయిబాబా శర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు.

వీరాంజనేయ స్వామికి పూజలు..

సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్వామిని మంగళవారం దర్శించుకుని తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):విద్య, ఆర్థిక రంగంలోని అనేక సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి జరుగుతోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గెడ్డం దేవానందరావు అన్నారు. విద్యాశాఖ భవనం వద్ద మంగళవారం నేతలు రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. 15 నుంచి 19వ తేదీ వరకే బైక్ జాతాలు జరిపి 25న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుపుతామన్నారు. జయరాజు, కె.శ్రీనివాసరావు, ఎ.చినబాబు, టి.రాంబాబు పాల్గొన్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు

కొయ్యలగూడెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మండలంలోని రాజవరం, యర్రంపేట గ్రామాల్లోని ఎరువుల షాపుల పై దాడులు చేయగా అక్కడ ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నాయని విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి : సీపీఎం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల హక్కును హరించే ఎస్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఎన్నికల కమిషన్‌కు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా సదస్సుకు ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదమని, ఓటర్ల హక్కును హరించే ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. సదస్సులో సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగమణి, పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు జీవరత్నం, భాస్కర్, ముత్యాలమ్మ, వెంకట్రావు, సుధారాణి, సూర్యకిరణ్, ఎ.శ్యామలరాణి, ఇస్సాకు, అరుణకుమారి, సుభాషిణి పాల్గొన్నారు.

రాజీవ్ స్నేహవారధి వద్ద సీపీఎం ధర్నా..

వసంతమహల్ సెంటర్ నుంచి రామచంద్రరావుపేట వెళ్లే రైల్వే అండర్ గ్రౌండ్ కాజ్‌వే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఆధునిక టెక్నాలజీతో భూగర్భం నుంచి నీరు రాకుండా నియంత్రించే చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాజీవ్ స్నేహ వారధి వద్ద మంగళవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు సంయుక్తంగా ధర్నా నిర్వహించారు. పాలకులు, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పి.వి.రామకృష్ణ, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, ఎ.శ్యామలరాణి, అరుణకుమారి, కారం భాస్కర్, జె.గోపీలు డిమాండ్ చేశారు.



కాజ్‌వే సమస్య కోసం పోరాడుతున్న స్థానికులు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దంటూ ధర్నా..

సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ వద్ద విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఆదానీ మీటర్లు వద్దు.. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు, డి.ఎన్.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆట స్థలాలు పరిరక్షించాలంటూ ధర్నా..

స్థానిక రామచంద్రరావుపేటలోని సుబ్బమ్మదేవి హైస్కూలు విద్యార్థులకు కేటాయించిన ఆట స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు, మహిళా ప్రతినిధులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

దెందులూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వలి బీసీ సంక్షేమ హాస్టల్‌ను తహసీల్దార్ బత్తుల సుమతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, టాయిలెట్స్, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం కొత్తగూడెం శివారు సింగగూడెంలోని ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలించారు. డీటీ అంతర్వేది శ్రీనివాసరావు, ఆర్ఐ హేమలత ఉన్నారు.

పెరుగుగూడెంలో పొలం పిలుస్తోంది

దెందులూరు,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందని పెరుగుగూడెం మాజీ సర్పంచ్, సీతంపేట సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు యలమర్తి వీరవెంకట సత్యనారాయణ(శ్రీను) అన్నారు. బుధవారం పెరుగుగూడెంలో వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి బి.కరణ్‌ల ఆధ్వర్యంలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలందించారు. టీడీపీ గ్రామాధ్యక్షులు పావులూరి దశరథ రామయ్య పాల్గొన్నారు.

మాదేపల్లిలో నేత్ర వైద్య శిబిరం



ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):నేత్ర సమ స్యలను అశ్రద్ధ చేయవద్దని ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు హేమలత పేర్కొన్నారు. రూరల్ మండలం మాదేపల్లి శివాలయం ప్రాంగణం వద్ద రవి కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులచే మంగళవారం మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని టీడీపీ మండల కార్యదర్శి పైడిపాటి శేఖర్‌బాబు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ పైడిపాటి శ్రీనివాసరావు ప్రారంభించారు. డాక్టర్ హేమలత, రవికిరణ్ నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జాలిపూడి సొసైటీ అధ్యక్షుడు మోటేపల్లి పవన్ హరిచంద్రకుమార్, మాదేపల్లి పంచాయతీ మాజీ అధ్యక్షుడు కోసూరి వెంకట సుబ్బారావు, నరహరిశెట్టి రాధాకృష్ణ, పంచాయతీ గ్రామ కార్యదర్శి జగదీశ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం కల్పించండి


మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

టి.నర్సాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్ష పదవి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన తనకే కేటాయించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి కోరారు. కె.జగ్గవరంలో ఆయన నివాసం వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ అధ్యక్షతన మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో క్రమశిక్షణతో సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి 90శాతం టీడీపీలోనే కొనసాగుతున్నారని, జనాభా ప్రతిపాదికన నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం తమకే కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, కేతవరం ఉప సర్పంచ్ భీమవరపు జగన్మోహనరావు, కమిటీ గ్రామాధ్యక్షుడు జయవరపు శ్రీనివాసరావు, పీవీఎస్ఎస్ రామలింగేశ్వరరావు, కోరుకొండ భద్రం, కాసంనేని మాధవరావు, బొందలపాటి సత్యనారాయణ, భీమవరపు ప్రసాద్, బొందలపాటి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అప్పనవీడు ఆలయ పాలకవర్గం ఎంపిక


శ్రీనివాసరావు

పెదపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి ఆలయ నూతన పాలకవర్గాన్ని దేవదాయ శాఖ అధికారిక ఉత్తర్వుల ద్వారా మంగళవారం ప్రకటించినట్టు ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. అభయాంజనేయస్వామి దేవాలయ చైర్మన్‌గా వేమూరి శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా దేవాలయ ప్రధానార్చకులు, మరో పదిమంది సభ్యులు నూతన కార్యవర్గం త్వరలో బాధ్యతలు చేపట్టనుంది. దేవాలయ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలు మరింత మెరుగు పర్చేందుకు తనవంతు తగిన కృషి చేస్తానని ఈ సందర్భంగా వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. అలాగే మంగళవారం కావడంతో స్వామి ఆలయంలో 200 మందికి అన్నదానం నిర్వహించగా భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా వాక్ థాన్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏలూరు జిల్లా ఫుట్‌బాల్, అథ్లెటిక్ అసోసియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) అధ్యక్షులు జేఎంవీ ఆదిత్య, చైర్మన్ పి. పవన్, సెక్రటరీ సాయి ప్రకాష్, కె.శ్రీకాంత్ సౌజన్యంతో వాక్‌థాన్ ఉత్సాహంగా నిర్వహించారు. నడకపై అవగాహన కల్పించడమే వాక్‌థాన్ ఉద్దేశమన్నారు. వివిధ విభాగాల్లో ఐదు రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వాకర్స్ అధ్యక్షులు పత్తిపాటి నాగ విఘ్నేశ్వరరావు, ఎంజిఎఫ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జీఎస్ఎస్ పవన్ కుమార్, అథ్లెటిక్ కోచ్ ప్రసాద్, గొంతిన రామకృష్ణ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో మండల కమిటీ ఎన్నిక

కొయ్యలగూడెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల ఎన్‌జీవో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని ఎన్నికల అధికారి వై.నరేశ్‌బాబు తెలిపారు.ఈ మేరకు మంగళవారం మండలంలోని ఎంపీపీ సమావేశపు హాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు.అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా స్వామి, అసోసియేట్ అధ్యక్షులుగా రాంబాబు, ట్రె జరర్‌గా కే.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు, ఎస్.రాంబాబు, జగదీశ్ విశ్వనాథ్, జాయింట్ సెక్ర టరీలుగా వెంకటలక్ష్మి, కే.రవీంద్రవర్మ, బేబిరాణిలు, గంగాధరం ఎన్నికయ్యారని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

టి.నర్సాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కె.జగ్గవరంలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న ఏపిగుంట గ్రామానికి చెందిన కోరుకొండ వెంకటభద్రానికి సీఎం సహాయనిధి నుంచి రూ.70 వేల చెక్కును మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షులు నాయుడు రామకృష్ణారావుగౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, కేతవరం ఉప సర్పంచ్ బీమవరపు జగన్మోహన్‌రావు, పీవీఎస్ఎస్ రామలింగేశ్వరరావు, జయవరపు శ్రీనివాసరావు, కాసంనేని మాధవరావు పాల్గొన్నారు.

సురవరం జీవితం ఆదర్శనీయం

కామవరపుకోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ఇటీవల మృతి చెందిన సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలు నేటి యువతకు ఆదర్శంకావాలని పార్టీ ఏలూరు జిల్లా సమితి సభ్యులు టి.వి.ఎస్.రాజు పేర్కొన్నారు. మంగళవారం మీ-సేవా కేంద్రం వద్ద సుధాకరరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. రాఘవమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సాయన కనకరాజు, వి.ఎన్.సాగర్ రామలక్ష్మి, సబ్బి కనకారావు, వీరమళ్ళ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నప్రసాద వితరణ

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రంపాడులోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం చవితి వేడుకలు ముగిసిన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో బుధవారం భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు తెలిపారు. విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాఘ వేంద్ర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండల స్థాయి బ్యాంకర్ల సమావేశం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల స్థాయి బ్యాంకర్లు సంయుక్త కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం ఏలూరు ఆర్ఆర్ పేటలోని డీసీసీబీ బ్యాంకు హాల్లో లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి, ఏలూరు మండలంలో పని చేసే వివిధ బ్యాంకు మేనేజర్లు, డీఆర్డీఏ డిపార్ట్మెంట్, మెప్మా అధికారులు పాల్గొన్నారు. జూన్ 30వ తేదీ నాటికి వివిధ అంశా లపై వచ్చిన ఫిర్యాదులు దరఖాస్తులపై సమీక్షించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని పాఠశాల, కళాశాల విద్యార్థులకు సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గాంధీతత్వం-నేటి భారతం అంశంపై ఉమ్మడి జిల్లా స్థాయిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. డ్రాయింగ్ షీటుపై చిత్రాలు వేసి, స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ఐఎస్‌పీఎడ్యుకేషన్ ఎట్ జీమెయిల్ చిరునామాకు ఈ నెల 25లోగా పంపాలని కోరారు. విజేతలకు అక్టోబరు 2న బహుమతులు అందజేస్తామని, వివరాలకు 99490 93115లో సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

లింగపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లింగపాలెం నుంచి ధర్మాజీగూడెం వరకు 3.75 కోట్లతో నిర్మిస్తున్న ఆరు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులను కొణిజర్లలో మంగళవారం ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏళ్లగా ఈ గ్రామానికి సరైన రహదారి లేక పల్లెప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపిడీఓ కె.వాణి, పీఆర్ ఏఈ జగన్నాథరావు, టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు, గుత్తా వెంకటేశ్వరరావు, పల్లి శ్రీను, మోరంపూడి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అక్కా చెల్లెళ్లపై దాడి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో అక్కా చెల్లెళ్లపై 20 మంది దాడి చేసిన ఘటన ఏలూరులోని అశోక్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఏలూరు మండలానికి చెందిన ఒక యువతి(24) బ్యూటీషన్ కోర్సు నేర్చుకుని ఏలూరులోని అశోక్‌నగర్ ప్రాంతంలోని తన చెల్లితో ఉంటూ బ్యూటీ పార్లర్‌ను నడుపుతున్నారు. కొవ్వాడ గ్రామానికి చెందిన మోరు నాగశివశంకర్ అనే యువకుడు ఆ యువతితో పరిచయం పెంచుకుని పెళ్లిచేసుకోవడానికి సిద్ధపడ్డాడు. ఈ విషయం శివశంకర్ కుటుంబ సభ్యులకు తెలియడంతో కులాంతర వివాహం చేయడం ఇష్టం లేక ఐదు నెలల క్రితం అతడికి వేరే యువతితో వివాహం చేశారు. అయితే ఆ వివాహం శివశంకర్‌కు ఇష్టం లేక అప్పటి నుంచి తరచుగా తాను ప్రేమించిన యువతి వద్దకు వస్తూ వెళ్తున్నాడు. ఆమె వల్లే శివశంకర్ తాను పెళ్లి చేసుకున్న భార్యతో సరిగా ఉండడంలేదని భావించి, యువకుడి కుటుంబ సభ్యులు ఆ యువతిని, ఆమె చెల్లిపై దాడి చేశారు. వీరిరువురు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం : మంత్రి సారథి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలో అడవి నెక్కలం గ్రామానికి చెందిన డి. సోనియా అనారోగ్యానికి గురికావడంతో ఆమె కుటుంబీకులు విజయవాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని మంజూరు చేయించడంతో వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి ఏపీటీఎఫ్ నిరసన వారం

ముదినేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17 వరకు నిరసన వారం నిర్వహించనున్నట్టు సమాఖ్య జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ నెల 11న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు, 12న నిరసన ప్రదర్శన, 13, 14 ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా వినతులు పంపనున్నట్టు వివరించారు.

భూ సమస్యలపై సబ్ కలెక్టర్ గ్రామసభ


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ వినూత్న

ముసునూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లిలో భూముల సమస్య పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. గ్రామంలో 166 మంది రైతులకు సంబంధించిన పట్టా భూములు అడంగళ్‌లో చెరువుగా నమోదు కావడంతో, బ్యాంక్ రుణాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో బాధిత రైతులు ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళగా సమస్యను పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో మంగళవారం గ్రామ సచివాలయం వద్ద తహసీల్దార్ దాసరి ప్రశాంతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సబ్ కలెక్టర్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ 60 మంది రైతుల నుంచి అర్జీలు వచ్చాయని, మిగిలిన రైతులు శుక్రవారం లోపు అర్జీలు అందజేయాలని సూచించారు. సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పవతి శ్రీనివాసరావు, వీఆర్వో కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ శిబిరం



ముసునూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ జి.ప్రశాంతి అన్నారు. మంగళవారం రమణక్కపేట మెయిన్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో ఉచిత ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించి 10 మంది దివ్యాంగ పిల్లలకు డాక్టర్ ప్రశాంతి చికిత్స అందించి, వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దివ్యాంగుల్లో మనో ధైర్యాన్ని నింపేందుకు ప్రభుత్వం ఉచిత చికిత్సతోపాటు ఉపకరణాలు, ఇతర పథకాలను అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శిబిరాన్ని ఎంఈవో-2 బీవీఎస్ సుబ్బారావు తనిఖీ చేశారు. ఐఈఆర్పీలు లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లీశ్వరి, హెచ్ఎం పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో అధిక ఆదాయం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామా యిల్ తోటల్లో మిశ్రమ పంటల ను సాగు చేయ టం ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చని, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కాళిదాసు అన్నారు. నూజివీడు మండలం దేవరగుంటలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పామాయిల్ తోటల నిర్వహణ, సాగు విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళిదాసు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో మిశ్రమ పంటలైన వక్క, అరటి, కోకో తదితరాలు సాగు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు విద్యాసాగర్ మాట్లాడుతూ యూరియాకి బదులుగా నానో యూరియా లేదా ఇతర సేంద్రియ ఎరువులను ఉద్యానపంటలకు అందించాలన్నారు. నూజివీడు నియోజకవర్గంలో యూరియా కొరత లేదన్నారు. నూజివీడు మండల ఉద్యానవనశాఖ అధికారి ఆర్.హేమ, వ్యవసాయ అధికారి చెన్నారావు, పతాంజలి పామాయిల్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



యోగా పోటీల్లో గురుకుల బాలికల ప్రతిభ

ముసునూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యోగా పోటీల్లో ముసునూ రు గురుకుల బాలికలు పలు విభాగాల్లో బహుమతులను సాధించారు. ఏలూరు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో జరిగిన పోటీల్లో జూనియర్ విభాగంలో జె. హరిక ప్రథమ, ఎల్. అను ద్వితీయ, కె.తప్సీ తృతీయ బహుమతులను సాధించగా, సబ్ జూనియర్ విభాగంలో కె.సౌజన్య ద్వితీయ, కె.ఐశ్వర్య తృతీయ బహుమ తిని సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం బాలిక లను ప్రిన్సిపాల్, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.




సత్తా చాటిన లిఖిత, సుశాంత్

ఆగిరిపల్లి: జిల్లాస్థాయి యోగా పోటీల్లో ఆగిరిపల్లి మండల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. సబ్ జూనియర్ విభాగంలో జూటూరు లిఖిత ప్రథమం, సుశాంత్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు యోగా మాస్టర్ బొద్దూరు సాంబశివరావు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలి


ఎంఈవో సబ్బారావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


ముసునూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమబోధన అందించి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలని ఎంఈవోలు పి.సుభా షిణి, బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు విద్యాశాఖ కార్యాల యంలో ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వ హించారు. మండలంలో సీనియర్ ఉపాధ్యాయులు, మరో ఏడాదిలో రిటైర్ కాబోయే ఉపాధ్యాయులు తొమ్మిది మందితోపాటు ఎంఈవోలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. నాయకులు కె.గాంగేయుడు, జి.ఉదయ్ భాస్కర్, కె.బాబురావు, జి.పద్మకిషోర్, జి.వి రత్నం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సత్కారం

కలిదిండి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ డేను పురస్కరించుకుని భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జె.దేవాదాస్, జి.ఓబుల్ రెడ్డి, ఎంవి.ఎస్.సుబ్బరాజు, ఎన్.శ్రీహరి ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు ఎం.సునీతను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మంతెన సుబ్బరాజు, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


బైఠాయించిన ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు


ధర్నా చేస్తున్న ఎంపీపీ, సభ్యులతో చర్చిస్తున్న తహసీల్దార్ లతీఫ్ పాషా

తహసీల్దార్ వ్యాఖ్యలపై భగ్గు

- మూకుమ్మడిగా సభ్యుల వాకౌట్, ధర్నా
- రసాభాసగా ముదినేపల్లి మండల సమావేశం
- తహసీల్దార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- జేసీ, ఆర్డీవో జోక్యంతో సమసిన వివాదం

ముదినేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. తహసీల్దార్ లతీఫ్ పాషా వ్యాఖ్యలు సభ్యులను, సర్పంచ్‌లను అవమానపరిచేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ రాచూరి రాధా సుకన్యతో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శీలం రామకృష్ణతోపాటు సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచ్‌లు పార్టీలకతీతంగా మూకుమ్మడిగా సమావేశాన్ని బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయ ఎదుట ధర్నాకు దిగారు. తహసీల్దార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అసలేం జరిగిందంటే..

ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమయ్యాక వ్యవసాయ, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై చర్చ జరిగిన అనంతరం రెవెన్యూ శాఖపై చర్చ సందర్భంగా వివాదం చోటు చేసుకుంది. మండలంలోని చినకామనపూడిలో పంచాయతీ ఊర చెరువు హద్దులు తేల్చాలని ఆ పంచాయతీ చేసిన తీర్మానంపై రెవెన్యూ అధికారులు సరైన చర్యలు తీసుకోవటం లేదని ఆ గ్రామ సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య సమావేశంలో ప్రస్తావించగా, వారం రోజుల్లో జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయిస్తామని తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. అనంతరం కొర్రగుంటపాలెం పంచాయతీ పరిధిలో అంతర్గత రోడ్లు ఆక్రమణకు గురయ్యారని, సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తే రోడ్ల నిర్మాణం చేపడతామని సర్పంచ్ పేరే రామకృష్ణ అడిగిన సందర్భంలో తహసీల్దార్ జోక్యం చేసుకుని సర్పంచ్‌లు చట్టాలు తెలుసుకుని పూర్తి నాలెడ్జ్‌తో మాట్లాడాలని, సగం సగం నాలెడ్జ్‌తో మాట్లాడవద్దని అన్నారు. దీంతో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ సర్పంచ్‌లను ఆఫ్ నాలెడ్జ్ ఉన్న వాళ్లుగా మాట్లాడతారా, మీ వ్యాఖ్యలు ఉపసంహించుకుని క్షమాపణ చెప్పండి అంటూ వేదిక వద్దకు వెళ్లి తహసీల్దార్‌ను డిమాండ్ చేశారు. అప్పటికే సమావేశంలో ఉద్రిక్తత చోటు చేసుకోవటం, సభ్యులు, సర్పంచ్‌లు మూకుమ్మడిగా అభ్యంతరం చెప్పటంతో తహసీల్దార్ సమావేశం నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా, సర్పంచ్ విశ్వేశ్వరరావు తమకు సమాధానం చెప్పి వెళ్లాలని తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ కూడా తహసీ ల్దార్‌ను నిలదీసినా ఆయన సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సభ్యులంతా కార్యాలయ ఆవరణలో బైఠాయించారు.

తహసీల్దార్ క్షమాపణలతో ధర్నా విరమణ

సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న జేసీ ధాత్రిరెడ్డి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌ను ఆదేశించారు. దీంతో ఆర్డీఓ ముదినేపల్లి తహసీల్దార్‌తో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. కొద్దిసేపటికి తహసీల్దార్ లతీఫ్ పాషా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బైఠాయించిన సభ్యుల వద్దకు వచ్చి తాను సర్పంచ్‌లను కించపరిచే ఉద్దేశ్యంతో మాట్లాడలేదని, తన వ్యాఖ్యలు సభ్యులకు బాధ కలిగిస్తే అందుకు తాను చింతిస్తున్నానని, అన్యదా భావించకండి అని చెప్పటంతో సభ్యులు ధర్నా ముగించారు.


ఆస్పత్రి నుంచి బయటకు వచ్చేస్తున్న విద్యార్థులు

ట్రిపుల్ ఐటీ ఆసుపత్రిలో షార్ట్ సర్క్యూట్..

తప్పిన ముప్పు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ ఆసుపత్రి భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం రాత్రి ఉన్నట్టుండి ఆసుపత్రి భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. ప్రమాదాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది మెయిన్ ఆఫ్ చేశారు. ఈ ఘటనలో విద్యుత్ వైర్లు దగ్ధమవ్వడం మినహా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని ట్రిపుల్ ఐటీ అధికారులు పేర్కొన్నారు.

రాధాకృష్ణన్ విజయంపై హర్షం

ముదినేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ విజయంపై భారతీయ జనతాపార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యావంతుడైన రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతి పదవికే వన్నె తేగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.


అన్నదాత పోరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

పక్షపాత వైఖరి తగదు

మాజీ ఎమ్మెల్యే ప్రతాప అప్పారావు

నూజివీడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులందర్నీ ఒకేలా చూడాల్సిన సీఎం చంద్రబాబునాయుడు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆరోపించారు. మంగళవారం నూజివీడులో జరిగిన అన్నదాత పోరులో ఆయన మాట్లాడుతూ మామిడికి మద్దతు ధర ఇచ్చిన సీఎం దానిని నూజివీడు ప్రాంతానికి అమలు పరచలేదన్నారు. ప్రస్తుతం అరటి ధర పడి పోయిందని ఈ పరిస్థితుల్లో రైతులు ఏ విధంగా మనుగడ సాగించగలరన్నారు. ప్రజా సమస్యలపై తాము పోరాడుతుంటే పోలీసులతో నిర్బంధిస్తున్నారని, అయినా తాము భయపడమన్నారు. నూజివీడు మామిడి రైతులకు అన్యాయం జరిగినా మంత్రి హోదాలో ఉన్న కొలుసు పార్థసారథి తనకేమీ పట్టనట్టు వ్యవహరించటం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. నూజివీడు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూరుగుగూడెంలో ఫాగింగ్

చాట్రాయి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ, పంచాయతీ ఆధ్వర్యంలో బూరుగుగూడెంలో మంగళవారం సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఎంపీపీ లంకా నిర్మల, సర్పంచ్ దేశిరెడ్డి హైమావతి ప్రజలతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే అశ్రద్ధ చేయకుండా పీహెచ్‌సీకి వెళ్ళి చికిత్స పొందాలని విజ్ఞప్తి చేశారు. కూటమి నాయకులు తేళ్ళూరి శేఖర్, జయప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ దార్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

15న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 15న ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ మంగళవారం తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కేవలం ఏలూరు జిల్లాకు చెందినవారు మాత్రమే పోటీలకు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు ఏఎస్ఆర్ స్టేడియంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలకు ఏలూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ప్రసాద్ తెలిపారు. 15న ఉదయం 8గంటలకు ఏఎస్ఆర్ స్టేడియంలో క్రీడాకారులు హాజరుకావాలని వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, లేదా ఎస్ఎస్‌సి మార్కుల లిస్టు, పాస్ పోర్టు సైజ్ ఫోటోలు తేవాలని, మరింత సమాచారానికి 86865 40555 సంప్రదించాలన్నారు.

కూటమిని విమర్శించే అర్హత వైసీపీకి లేదు


రామచంద్రపురం రెగ్యులేటర్ వద్ద సాగర్ నీటిని పరిశీలిస్తున్న చైర్మన్ బాలకృష్ణ

ముసునూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో జరిగిన అన్నదాత పోరులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ వ్యాఖ్యలను డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగర్ జలాలు ఇన్ని రోజులు వచ్చాయా? ఒక్క చెరువునైనా నింపారా అని ఆయన ప్రశ్నించారు. గతంలో మామిడికి గిట్టుబాటు ధర లేక కలెక్టర్ ఆఫీస్ వద్ద రైతులు ధర్నాలు చేసింది మీరు చూడలేదా, కడపలో అరటికాయలను రోడ్డుపై పోసి ఆందోళనలు చేయలేదా అన్నారు. అప్పుడూ రైతులకు న్యాయం చేయలేక, ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారా అని విమర్శించారు. ఈ రోజు కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటూ పాలన సాగిస్తూంటే తట్టుకోలేక విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, గత ఐదేళ్ళలో ఒక్క సొసైటీ లో ఎరువులను రైతులకు అందించకుండా, నేడు రైతు లకు సకాలంలో ఎరువలను అందిస్తుంటే యూరియా కొరత ఉందని రైతులను రెచ్చగొడుతూ దిక్కుమాలిన రాజకీయాలను చేస్తున్నారన్నారు. కూటమిని విమర్శించే అర్హత వైసీపీకి లేదన్నారు.

చెరువులను నింపుకోండి..

సాగర్ జలాలతో చెరువులను నింపేందుకు రైతులు సహకరించాలని వేంపాడు మేజర్ డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ కోరారు. మంగళవారం రామచంద్రాపురం 117 రెగ్యులేటర్ వద్ద వేంపాడు కాలువకు వస్తున్న సాగర్ జలాలను ఆయన పరిశీలించారు. మంత్రి పార్థసారథి చొరవతో గతంలో ఎన్నడూలేని విధంగా నూజివీడు నియోజకవర్గానికి సాగర్ జలాలు పుష్కలంగా వస్తున్నాయన్నారు. ఈ జలాలు మరో 20 రోజులు పాటు వస్తాయని, చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్ళేలా ఎన్ఎస్పీ అధికారులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అందుబాటులో యూరియా.. ఆందోళన వద్దు


యనమదల పీఏసీఎస్‌లో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీపై యనమదల పీఏసీఎస్‌లో అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నూజివీడు తహసీల్దార్ భద్రు నాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా లభ్యత, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 59 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతుల అవసరాలకు తగ్గట్లుగా యూరియాను అందుబాటులో ఉంచటం జరిగిందని వారు తెలిపారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పీఏసీఎస్‌ను మంగళవారం ఏవో భవాని తనిఖీ చేసి, యూరియా పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆగిరిపల్లి, నరసింగపాలెం, శోభనాపురం పీఏసీఎస్‌లలో 37.8 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వరి పంటలకు ఎకరానికి 30 కేజిల చొప్పున 3 డోసులలో 90 కేజిలు మాత్రమే వాడాలని రైతులకు తెలిపారు. రబీ సీజన్ అవసరాలకు ఇప్పటి నుంచే యూరియా కొనుగోలు చేయరాదని తెలిపారు. మండలంలోని అన్ని సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

నానో ఎరువులతో అధిక దిగుబడులు

ముసునూరు: యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని ఏవో ఎ.చాముండేశ్వరి అన్నారు. అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. నానో ఎరువుల వాడకం వల్ల పంటలకు చీడపీడల వ్యాప్తి తగ్గి, అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. మంగళవారం నాడు మండలంలో 25 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఎకరానికి 20-25 కేజీల యూరియాను రైతులు వాడుకోవాలని, అధిక మొత్తంలో వాడితే చీడపీడలు, దోమ, రసంపీల్చే పురుగులు, కాండం తొలిచే పురుగు ఆశిస్తాయని తెలిపారు. ఎకరానికి 500 మిల్లీ లీటర్ల నానో యూరియాను పిచికారీ చేసుకోవాలన్నారు. ఆయిల్ పామ్, అరటి పంటల సస్యరక్షణ చర్యలపై ఏవో వివరించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు, మల్లిబాబు, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మానురాజు సురేష్, వీఏఏ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కలిదిండి బీసీ బాలికల హాస్టల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

లోకాయుక్తలో ఫిర్యాదుపై హాస్టళ్లు తనిఖీ చేసిన తహసీల్దార్

కలిదిండి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలను విద్యార్థుల కాస్మెటిక్స్‌కు వాడుతున్నారని బాలికల హాస్టల్స్‌కి భద్రత ఉండటం లేదని గైర్హాజరైన విద్యార్థుల నగదును వార్డెన్లు కాజేస్తున్నారని ఓ వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేయటంతో మంగళవారం కలిదిండి బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్, కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్స్‌ను తహసీల్దార్ రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా హాస్టల్స్‌లో ఎటువంటి అవకతవకలు లేదని తహసీల్దార్ తెలిపారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలలో ఆక్రమణల తొలగింపు

ముసునూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు ఎంపీపీ పాఠశాలలోని ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. ఈ పాఠశాల భవనంలో పిల్లలు లేక కొన్నేళ్ళుగా నిరుపయోగంగా ఉండటంతో అక్రమంగా గత నాలుగేళ్ళ నుంచి రేషన్ దుకాణం, పాలకేంద్రం నడుస్తుండంతోపాటు ఇటీవల ఒక వ్యక్తి టెంట్‌హౌస్ సామగ్రిని సైతం పెట్టుకున్నాడు. వీటిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు రావడంతో ఎంపీడీవో బీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. భవనాన్ని పంచాయతీకి అప్పగించినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వ భవనాలను ఆక్రమించుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో సుధ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మండలపు ధర్మరాజు, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కలిదిండి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ఒకటో వార్డులో మంగళవారం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,520 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

జీవో తెచ్చిన తంటా!

(5వ పేజీ తరువాయి)

అప్రూవల్ చేసేవారు. భవనం ప్లాన్ ప్రకారం కట్టకపోతే మున్సిపల్ అధికారులే జరిమానాలు విధించడం, డివి యేషన్ అయిన భాగాన్ని తొలగించడం చేసేవారు. ఇప్పుడు ఆ బాధ్యతలన్నీ ప్రైవేటు ఎల్‌టీపీ లకు కట్టబెట్టడంలో ప్రభుత్వ అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రజలకు మేలు చేసేందుకే జీవో తెచ్చినట్టు చెబుతుంది. గతంలో నిర్మాణదారుడు ఒక ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని బాధ్యతలన్నీ ఎల్‌టీపీల మీద మోపింది. దీంతో ఎల్‌టీపీల యూనియన్లు మీటింగులు పెట్టుకుని ప్రభుత్వ నిబంధనలు సవరించే వరకు ప్లాన్‌లు గీయడం, అప్రూవల్ చేయవద్దనే నిర్ణయానికి వచ్చారు. అయితే జీవోలో ప్రభుత్వం కొన్ని సవరణలు చేసినా ఎల్‌టీపీలు సంతృప్తి చెందలేదు. మరిన్ని సవరణలు చేయాలని ప్రభుత్వానికి ఎల్‌టీపీలు విన్నవించుకున్నారు. ప్రభుత్వం ఎల్‌టీపీల డిమాండ్లను పరిశీలిస్తుంది.

ఎల్‌టీపీలు ముందుకు రండి



ప్రజాప్రయోజనాల దృష్ట్యానే ప్రభుత్వం స్వీయసర్టిఫికేషన్ 2025 జీవో నంబర్ 20ని తీసుకొచ్చింది. నిబంధనలు సరళతరం చేసి త్వరితగతిన నిర్మాణదారులకు ప్లాన్ అప్రూవల్ చేయడానికి ఈ జీవోను తీసుకొచ్చింది. ఎల్‌టీపీలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ఇప్పటికే కొంత మంది ఎల్‌టీపీలు ముందుకొస్తున్నారు. మిగిలినవారు ముందుకొచ్చి ప్లాన్‌లు అప్రూవల్ చేయాలి. భవనా లు నిర్మించుకునే యజమానులు ప్లాన్ ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి. ఎటువంటి డివియేషన్లు లేకుండా భవనాలు నిర్మించుకోవాలి. ప్రభుత్వం ఇప్పటికే జీవో 20లో ఎన్నో సవరణలు చేసింది.

-భానుప్రతాప్,
ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్